# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జనం రిపోర్టర్ జన శ్రేయస్సే మా బాధ్యత

విలేకరులు కావలెను
జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక
ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారీగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు
సంప్రదించండి: 9398 15 6948

సంపుటి : 02 సంచిక : 38, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం - 06- జూన్ - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు..
# ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ
## చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్

- గత ప్రభుత్వంలో సీఎం హెలికాప్టర్‌లో వస్తున్నా చెట్లు నరికేశారు: చంద్రబాబు
- నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నాం
- ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం
- "రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది






అమరావతి: నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అమరావతి పరిధి అనంతవరం ఏడీసీఎల్ పార్కులో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి నారాయణతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలి. గత ప్రభుత్వం చెట్లు నరకడం తప్ప సంరక్షించింది లేదు. అప్పుడు సీఎం హెలికాప్టర్‌లో వస్తుంటే కూడా చెట్లు నరికారు. అలా నరికితే కొన్ని దేశాల్లో జైల్లో పెడతారు. మొక్కలు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?

స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు.. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. మిగతా..2లో

## బక్రీద్ వేళ కొందరు గోవులను దొంగ చాటుగా
# కబేళాలకు తరలించే అవకాశం ఉంది



అమరావతి: గోవులను సంరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గోవులను పవిత్రంగా ఆరాధించే గొప్ప సంస్కృతి మన సమాజంలో ఉందని, అటువంటి గోమాతలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన అన్నారు. చట్టాలు కూడా గోవధను ఏమాత్రం అంగీకరించవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేశారు. "గోమాతల సంరక్షణ కోసం ఇప్పటికే ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికార యంత్రాంగానికి ప్రజల నుంచి పూర్తి సహకారం అందాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి" అని తెలిపారు. గో సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ దీన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో, కొందరు వ్యక్తులు గోవులను అక్రమంగా, దొంగచాటుగా కబేళాలకు తరలించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టేందుకు అధికారులు ఇప్పటికే పలు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన మిగతా..2లో




### వాళ్ల ఆవేదన పట్టించుకోండి... మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి

ఏపీలో రేపటి నుంచి మెగా డీఎస్సీ

డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను పట్టించుకోవాలన్న షర్మిల మంత్రి లోకేశ్ ను ఉద్దేశిస్తూ ట్వీట్




### 34 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానం.. వేడుకలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

- హెరిటేజ్ ఫుడ్స్ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేశ్

## కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

బనకచర్ల-గోదావరి అనుసంధానంపై కూడా..




ఉద్యోగుల అంశాలపైనే సుదీర్ఘ చర్చతో.. గురువారం నాటి భేటీలో జరగని సమీక్ష



### మళ్లీ కరోనా కలకలం... 24 గంటల్లో
## 564 కొత్త కేసులు.. ఏడుగురి మృతి
### భారత్‌లో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
### యాక్టివ్ కేసుల సంఖ్య 4,866కు చేరిక
### కేరళలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన మహమ్మారి, ఇప్పుడు మళ్లీ విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది, మరణాలు కూడా మిగతా..2లో

## ఉద్యోగుల డిమాండ్లపై
# క్యాబినెట్‌లో చర్చ.

ఉద్యోగుల సమస్యలపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక, డీఏ, ఆరోగ్య భద్రత

పెండింగ్ బిల్లుల కార్యాచరణపై చర్చ

ప్రస్తుతం ఒక డీఏ, ఆరునెలల తర్వాత మరో డీఏ చెల్లిస్తాం

బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం ఉద్యోగుల డిమాండ్లపై ప్రధానంగా చర్చించింది. దాదాపు ఐదున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో.. ఉద్యోగుల సమస్యలపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక, డీఏ, ఆరోగ్య భద్రత పెండింగ్ బిల్లుల కార్యాచరణపై చర్చించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మిగతా..2లో




### పుతిన్ గట్టిగానే చెప్పారన్న ట్రంప్..
## ధ్రువీకరించిన క్రెమ్లిన్




- ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటాం
- ప్రతీకార దాడులు చేయాలన్న తమ ప్లాన్ గురించి ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు వెల్లడి
- పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడా




### మొక్కలు నాటకపోతే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి

హైదరాబాద్: మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ చేయకపోవడంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. వాటిని సంరక్షించుకోవాలని కోరారు.

## ఛత్తీస్ గఢ్ లో భీకర ఎన్‌కౌంటర్...

- మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి




- బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ హతం
- సుధాకర్ తలపై రూ. కోటి రివార్డు
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మోస్ట్ వాంటెడ్

# ఉద్యోగులకు 2 డీఏలు




రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ

- తక్షణమే ఒకటి చెల్లింపు.. 6 నెలల తర్వాత రెండో డీఏ
- మళ్లీ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీలు
- ఉద్యోగులకు వైద్య సదుపాయం కోసం ట్రస్ట్
- ప్రతి నెలా రూ. 700 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- సచివాలయంలో 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటా
- అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలకు పెంపు
- ఎన్నికల్లో బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత స్థానాలకు బదిలీ
- హామ్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రోడ్ల అభివృద్ధి
- కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో మెట్రో రైలు విస్తరణ
- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు (కరువు భత్యం) చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను తక్షణమే చెల్లించాలని నిర్ణయించింది. నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లించనుంది. ఇక మరో డీఏను 6 నెలల తర్వాత చెల్లించనుంది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై ప్రకటన చేయనుంది. ఉద్యోగులకు 5 పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి రెండు డీఏలపైనే కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీఎం ఉపసంఘానికి నేతృత్వం వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..

ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను మిగతా..2లో

### బెంగళూరు తొక్కిసలాట... కమిషనర్ సహా ఐదుగురు
# పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు

- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11 మంది మృతి
- బెంగళూరు పోలీస్ కమిషనర్ సహా ఐదుగురు సీనియర్ అధికారుల సస్పెన్షన్



బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనపై తీవ్రంగా స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి. దయానంద, డీసీపీ (సెంట్రల్ డివిజన్) హెచ్.టి. శేఖర్‌తో సహా ఐదుగురు సీనియర్ పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. విచారణను క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. విధానసౌధలో గురువారం నిర్వహించిన అత్యవసర మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. "కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ మిగతా..2లో

# 34 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానం.. వేడుకలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

అమరావతి: హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను కొనియాడారు. రైతుల సాధికారతకు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడంలో హెరిటేజ్ ఫుడ్స్ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. హెరిటేజ్ ఫుడ్స్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనడం తనకు గర్వకారణంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దార్శనికుడైన చంద్రబాబు నాయుడు స్థాపించిన ఈ సంస్థ, రైతులను శక్తివంతం చేయడంలోనూ, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడంలోనూ కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. తాను కూడా ఒక పూర్వ విద్యార్థిలా గర్వంగా భావిస్తున్నానని, పాత మిత్రులు, సహోద్యోగులను కలుసుకోవడం సంతోషాన్నిచ్చిందని లోకేశ్ తెలిపారు. సంస్థను నడిపిస్తున్న బలమైన నాయకత్వం, విలువలను చూసి తాను ఎంతగానో ఉత్తేజితుడనయ్యానని మంత్రి వివరించారు. హెరిటేజ్ బృందం అంకితభావాన్ని అభినందించిన ఆయన, భవిష్యత్తులో కూడా సంస్థ మరింతగా వృద్ధి చెందుతుందని, దేశ ప్రగతికి గణనీయమైన తోడ్పాటు అందిస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ జ్ఞాపకాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకునేందుకు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాను ఒక మొక్కను నాటినట్లు మంత్రి నారా లోకేశ్ తెలియజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానం రైతులకు అండగా నిలుస్తూ, వినియోగదారుల మన్ననలు పొందుతూ విజయవంతంగా కొనసాగుతోందని ఆయన ప్రశంసించారు. సంస్థ ఉద్యోగులు, యాజమాన్యానికి లోకేశ్ తన శుభాకాంక్షలు తెలియజేశారు.

### నారా లోకేశ్ గారికి కృతజ్ఞతలు: నారా బ్రాహ్మణి

ఈ కార్యక్రమంలో నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రాహ్మణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగించారు. "హెరిటేజ్ ఫుడ్స్ 34 వసంతాల సుదీర్ఘ ప్రస్థానాన్ని మేము వేడుకగా జరుపుకుంటున్న ఈ ప్రత్యేక సందర్భంలో, మా సంస్థ సాధించిన విజయాలు, మా ప్రయాణం నాకెంతో గర్వకారణంగా ఉంది. రైతులను ఆర్థికంగా శక్తివంతం చేస్తూ, దేశ ప్రజలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలనే ఒక గొప్ప సంకల్పంతో మా మామగారు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈ సంస్థకు బీజం వేశారు. అటువంటి గొప్ప వారసత్వంలో నేను కూడా ఒక భాగమైనందుకు ఎంతో సంతోషిస్తున్నాను. 1992లో ఆయన దార్శనికతతో, ఒక చిన్న ప్రయత్నంగా మొదలైన హెరిటేజ్ ఫుడ్స్, ఈ రోజు దేశవ్యాప్తంగా ఇంతటి మహోన్నత స్థాయికి చేరుకోవడం వెనుక ఆయన అకుంఠిత దీక్ష, మా అందరి సమష్టి కృషి ఉన్నాయి. కేవలం వ్యాపార విస్తరణే కాకుండా, అన్నదాతల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చే ఒక వేదికగా, కోట్లాది ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఒక విశ్వసనీయమైన సంస్థగా హెరిటేజ్ రూపుదిద్దుకుంది. మా మామగారు చూపిన మార్గం, ఆయన ఆశయాలు ఎప్పటికీ మాకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ప్రస్తుతం, హెరిటేజ్ ఫుడ్స్ దేశంలోని 13 రాష్ట్రాలలో తన కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తోంది. మూడు లక్షలకు పైగా రైతు సోదరులతో మాకున్న విడదీయరాని అనుబంధం మా సంస్థకు వెలకట్టలేని ఆస్తి. వారి నిరంతర సహకారంతోనే, కోటి మందికి పైగా వినియోగదారుల ఆదరాభిమానాలను మేము పొందగలుగుతున్నాం. హెరిటేజ్ అంటేనే నమ్మకం, నాణ్యత, ఒక ఉన్నతమైన సామాజిక లక్ష్యం అనే బలమైన భావనను ప్రతి వినియోగదారుడి మదిలో నిలబెట్టగలిగాం. ఈ అద్భుత ప్రయాణంలో మేము మరో కీలకమైన ఆర్థిక మైలురాయిని కూడా అధిగమించాం. 2025 ఆర్థిక సంవత్సరంలో మా సంస్థ వార్షిక ఆదాయం రూ.4,000 కోట్లు దాటింది. ఇది మా 3,300 మందికి పైగా ఉన్న ఉద్యోగుల అంకితభావం, నిబద్ధత, సమిష్టి కృషి వల్లే సాధ్యపడింది. ఈ విజయం మా ఉద్యోగులందరిది. ఈ విజయవంతమైన ప్రయాణంలో నేను కూడా ఒక భాగస్వామిని అయినందుకు వ్యక్తిగతంగా ఎంతో గర్వపడుతున్నాను. ఈ రోజు మా వార్షికోత్సవ వేడుకల్లో నారా లోకేశ్ గారు పాల్గొని, మా సంస్థ అభివృద్ధికి అహర్నిశలూ పాటుపడుతున్న, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను స్వయంగా సత్కరించడం మాకు రెట్టింపు ఆనందాన్నిచ్చింది. ఆయన పలికిన ప్రోత్సాహకరమైన మాటలు, చూపిన ఆత్మీయత మా హెరిటేజ్ కుటుంబ సభ్యులందరికీ, వ్యక్తిగతంగా నాకు ఎంతో అమూల్యమైనవి. ఈ సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానం భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో, రెట్టించిన ఉత్సాహంతో కొనసాగుతుందని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. రాబోయే రోజుల్లో మరింత మంది రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తామని, దేశ ప్రజలకు మరింత నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందిస్తామని హామీ ఇస్తున్నాను. ఈ గొప్ప సంస్థలో భాగమైనందుకు సంతోషిస్తూ, మా ఈ ప్రయాణానికి తోడుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంటూ వివరించారు.

## ఛత్తీస్ గఢ్ లో భీకర ఎన్‌కౌంటర్...

ఛత్తీస్ గఢ్ : మావోయిస్టు పార్టీకి మరో తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరైన, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్, భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు హతమైన నెల రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి టైగర్ రిజర్వ్ ప్రాంతంలో మావోయిస్టు సీనియర్ నాయకులు సమావేశమయ్యారన్న కచ్చితమైన సమాచారంతో భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) దళాలు సంయుక్తంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో, గురువారం తెల్లవారుజామున మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సుధాకర్ మరణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుధాకర్... మావోయిస్టు వర్గాల్లో గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, సోమన్న వంటి అనేక మారుపేర్లతో సుపరిచితుడు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామం. గత నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న సుధాకర్‌పై ప్రభుత్వం రూ. కోటి రివార్డు ప్రకటించింది. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో కూడా ఆయన పాల్గొన్నారు. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్ ఘటనను ధృవీకరించారు. అయితే, సుధాకర్ మృతికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం బీజాపూర్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత ఆరు నెలల కాలంలో మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు కీలక నాయకులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేయడం, మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా పరిగణిస్తున్నారు. మూడు వారాల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద ఎదురుదెబ్బ.

ఇదే ప్రాంతంలో మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు!

ఇదే ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ లీడర్ పాపారావు కూడా ఉన్నట్లు తమకు సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశ్... మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లోని కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నాడని, ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్రంలో నిపుణుడని, ఐఈడీ దాడులతో సహా అనేక హింసాత్మక ఘటనల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడని, అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. అయితే, వీరిద్దరి ఆచూకీకి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భద్రతా దళాలు ఆ ప్రాంతంలో తమ గాలింపును ముమ్మరం చేశాయి.

## మళ్లీ కరోనా కలకలం... 24 గంటల్లో
## 564 కొత్త కేసులు.. ఏడుగురి మృతి

మొదటి పేజి తరువాయి



మరణాలు కూడా నమోదవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం... నిన్నటి వరకు 4,302గా ఉన్న యాక్టివ్ కేసుల సంఖ్య, ఈరోజు 4,866కు చేరింది. కేవలం 24 గంటల వ్యవధిలో 564 కొత్త కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇదే సమయంలో గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఏడుగురు కోవిడ్ కారణంగా మరణించారు. మృతుల్లో ఢిల్లీకి చెందిన ఐదు నెలల చిన్నారి కూడా ఉండటం తీవ్ర విచారకరం. ఆ చిన్నారికి ముందే శ్వాసకోశ సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఆరుగురు మృతులు వృద్ధులు కాగా, వీరు మధుమేహం, అధిక రక్తపోటు, న్యూమోనియా వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సమాచారం. మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో ఇద్దరు చనిపోయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ (562), పశ్చిమ బెంగాల్ (538), మహారాష్ట్ర (526), గుజరాత్ (508) రాష్ట్రాలు నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఒక్కరోజే 105 కొత్త కేసులు వెలుగుచూడటం గమనార్హం. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తం 44 కోవిడ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయని, వీరిలో ఎక్కువ మంది ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారేనని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు స్వల్ప లక్షణాలతో ఉన్నాయని, బాధితులు హోమ్ కేర్‌లోనే కోలుకుంటున్నారని ఆరోగ్య అధికారులు చెబుతున్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు రద్దీ ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు. శ్వాసకోశ సంబంధిత లక్షణాలు కనిపిస్తే, పరిస్థితిని గమనిస్తూ, లక్షణాలు తీవ్రమైతే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని కోరారు. తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి అధికారిక సమాచార వనరులపైనే ఆధారపడాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బక్రీద్ వేళ కొందరు గోవులను దొంగ చాటుగా
## కబేళాలకు తరలించే అవకాశం ఉంది

మొదటి పేజి తరువాయి



వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ చర్యలకు ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గోవుల అక్రమ రవాణా లేదా వధకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

## ఉద్యోగులకు 2 డీఏలు

మొదటి పేజి తరువాయి

ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా బిల్లులు చెల్లించనుంది. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ. 500 వసూలు చేయడంతోపాటు సమాన మొత్తాన్ని ప్రభుత్వ వాటాగా ట్రస్ట్‌కు చెల్లించనుంది. ట్రస్ట్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనుండగా ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ట్రస్ట్ ద్వారా వైద్య సదుపాయం కల్పించనున్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ఏటా సెప్టెంబర్‌లో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇక జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న మరో కీలక డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించేందుకు ఒప్పుకుంది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో ప్రస్తుతం పూర్తిగా సెక్రటరియేట్ సర్వీసెస్ ఉద్యోగులే పనిచేస్తుండగా ఇకపై 12.5 శాతం నాన్ సెక్రటరియేట్ సర్వీసెస్ కోటాను అమలు చేయాలనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను మళ్లీ నియమించరాదనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామ కార్యదర్శి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు తిరిగి పంపించేందుకు అంగీకరించింది. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పూర్తితోపాటు నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు డిమాండ్లకు సైతం సమ్మతి తెలిపింది. అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనాలను రూ. 2 లక్షలకు పెంచింది. ఉద్యోగుల అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు వాహనాల అద్దెల పెంపునకు ఆమోదం తెలిపింది.

### మరికొన్ని నిర్ణయాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమల్లోకి తెచ్చింది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే నేరుగా బాధితులకు రూ. 10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 385 మంది మరణించగా రూ. 38.5 కోట్ల చెల్లింపులకు మంత్రివర్గం ఆమోదించింది. హైబ్రీడ్ యాన్యూటీ మోడ్ (హామ్) కింద రాష్ట్రంలోని అన్ని (పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ) రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తొలి దశ కింద 7,947 కి.మీ. పంచాయతీరాజ్, 5,190 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు కలిపి మొత్తం 13,137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనుంది. పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 16,780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16,414 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. వచ్చే రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయనుండగా 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకే ప్రభుత్వం అప్పగించనుంది. పార్లమెంట్ స్థానాన్ని ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో జిల్లాను ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ. 19,579 కోట్లతో అంచనాలతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కారిడార్%-%1లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ., కారిడార్%-%2లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్%-%3లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. కలిపి మొత్తం 86.1 కి.మీ. కారిడార్‌ను నిర్మించనుంది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఈ విషయంలో కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి పొంగులేటి కోరారు.

- రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహాన్ని కొనసాగించాలని.. ప్రజలకు మేలు చేసే కార్యాక్రమాలకు గ్రీన్ చానల్‌లో చెల్లింపులు జరపాలని నిర్ణయించింది. - ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 12 ఎకరాల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది.

## వాళ్ల ఆవేదన పట్టించుకోండి...
## మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయమై లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉద్దేశించి ఆమె పలు కీలక సూచనలు చేస్తూ, అభ్యర్థుల పట్ల కనికరం చూపాలని కోరారు. డీఎస్సీ విషయంలో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని షర్మిల పేర్కొన్నారు. "విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గారూ, రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి పరీక్ష సమయానికి కేవలం 45 రోజులు మాత్రమే గడువు ఇవ్వడం ఎంతవరకు సమంజసం?" అని ఆమె ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, అభ్యర్థులను మోసం చేసే 'దగా డీఎస్సీ' అని వారు వాపోతున్నారని షర్మిల తెలిపారు. కనీసం 90 రోజుల ప్రిపరేషన్ సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, కేవలం 45 రోజుల్లో మొత్తం సిలబస్ చదవడం సాధ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆమె వివరించారు. "మూడున్నర లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం కనికరం చూపాలి. వారు మీకు లేఖల మీద లేఖలు రాస్తున్నా స్పందించకపోవడం, నిరుద్యోగుల మొరను పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనం" అని షర్మిల విమర్శించారు. డీఎస్సీ వాయిదా వేయాలని కోరడాన్ని రాజకీయ కుట్రగా మంత్రి లోకేశ్ అభివర్ణించడం ఆయన తొందరపాటు నిర్ణయానికి అద్దం పడుతోందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని చెబుతూ, డీఎస్సీ నిర్వహణలో పరీక్ష రాసే అభ్యర్థుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని షర్మిల కోరారు. "90 పాఠ్య పుస్తకాలను కేవలం 45 రోజుల్లో అభ్యర్థులు ఎలా చదవగలరో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ప్రిపరేషన్ గడువును మరో 45 రోజులు పెంచే అంశంపై తక్షణమే పరిశీలన చేయాలి" అని ఆమె డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నార్మలైజేషన్ పద్ధతిలో కాకుండా డీఎస్సీ పరీక్షలను ఒకే జిల్లా, ఒకే పేపర్ విధానంలో నిర్వహిస్తే బాగుంటుందన్న అభ్యర్థుల వాదనపై కూడా ప్రభుత్వం పునరాలోచన చేయాలని షర్మిల కోరారు.

## మంత్రివర్గంలో మాదిగలకూ అవకాశం కల్పించండి

న్యూఢిల్లీ, : మంత్రివర్గ విస్తరణలో మాదిగలకూ అవకాశం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌ను ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అద్దూరి లక్ష్మణ్ కుమార్, మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య కోరారు. గురువారం ఢిల్లీలో వారిని కలిసిన అనంతరం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. 'మంత్రివర్గంలో నిజమైన మాదిగలకు అవకాశం కల్పించాలి. మంత్రివర్గంలో ఉన్న కొందరు మాదిగలమని చెప్పుకొంటున్నారు.. కానీ తెలంగాణ మంత్రివర్గంలో మాదిగలెవరూ లేరు. ఇది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేల అంశం కాదు. ఇది యావత్ తెలంగాణ మాదిగల ఆత్మగౌరవానికి చెందిన అంశం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యవసర సమావేశం ఉండడంతో కలవలేకపోయాం. ఈ విషయమై ఆయనకూ లేఖ రాశాం' అని వెల్లడించారు.

## ఉద్యోగుల డిమాండ్లపై
# క్యాబినెట్‌లో చర్చ.

మొదటి పేజి తరువాయి

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

క్యాబినెట్ నిర్ణయాలివే..

ఉద్యోగులకు రెండు డీఏలు చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించించి. ప్రస్తుతం ఒక డీఏ, ఆరునెలల తర్వాత మరో డీఏ చెల్లిస్తాం. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ఉద్యోగులకు మేలు చేసే విధంగా క్యాబినెట్ నిర్ణయాలు ఉద్యోగుల ఆరోగ్య బీమాకు సంబంధించి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది. ఉద్యోగులు, ప్రభుత్వం చెల్లించే డబ్బులను ట్రస్టులో జమ చేస్తాం. ఉద్యోగులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే ట్రస్టు ద్వారా డబ్బులు చెల్లిస్తాం. ఉద్యోగులకు సంబంధించిన బిల్లుల పెండింగ్ బకాయిలను నెలకు రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తాం. పెండింగ్ బకాయిలను నెలల వారీగా క్లియర్ చేస్తాం. గతేడాది 385 మంది మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణించారు. మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణిస్తే రూ.10లక్షలు ఇచ్చేందుకు నిర్ణయం. కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు క్యాబినెట్ నిర్ణయం. హెూమ్ విధానంలో రోడ్ల ఆధునికీకరణ చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో 5,100 కి.మీ, పంచాయతీరాజ్ పరిధిలో 7,947 కి.మీ రహదారులు ఆధునికీకరణ. రూ.19,575 కోట్లతో సుమారు 86 కి.మీ మెట్రో నిర్మాణానికి క్యాబినెట్ నిర్ణయం

## బెంగళూరు తొక్కిసలాట... కమిషనర్ సహా ఐదుగురు
## పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజి తరువాయి

"కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) (బాలకృష్ణ), సెంట్రల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) (హెచ్.టి. శేఖర్), స్టేడియం భద్రతకు బాధ్యత వహించిన అదనపు పోలీస్ కమిషనర్, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ (బి. దయానంద)లను తక్షణమే సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి, హెూంమంత్రి, మంత్రులు హెచ్.కె. పాటిల్, ఎం.సి. సుధాకర్, హెచ్.సి. మహదేవప్పలతో పాటు సీఐడీ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం వివరించారు. "ప్రాథమికంగా ఈ అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించాయి. అందుకే వారిని సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆర్సీబీ జట్టు తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో ఈ తొక్కిసలాట జరగడం బాధాకరమని, మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశాన్ని గురువారం జరిగిన సాధారణ కేబినెట్ సమావేశంలో తీవ్రంగా చర్చించామని, నిన్నటి దురదృష్టకర ఘటనపై చర్చించిన తర్వాతే ఈ నిర్ణయాలు తీసుకున్నామని సిద్ధరామయ్య తెలిపారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సీఎం చెప్పారు. వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. "నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఇలాంటి ఘటన జరగలేదు. ఈ ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది" అని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. "నిన్న ఆదేశించినట్లుగా మేజిస్టీరియల్ విచారణ ప్రారంభమైంది. ఈ పెను విషాదంపై కొంత సమాచారం అందిన తర్వాత, కేబినెట్ సమావేశంలో చర్చించాం. మూడు సంస్థలపై (ఆర్సీబీ, డీఎన్ఏ ఈవెంట్స్, కేఎస్‌సీఏ) దర్యాప్తును సీఐడీకి అప్పగించాం" అని ఆయన పునరుద్ఘాటించారు.

## పుతిన్ గట్టిగానే చెప్పారన్న ట్రంప్.. ధ్రువీకరించిన క్రెమ్లిన్

ఇంటర్నెట్‌డెస్క్: ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తనతో చాలా గట్టిగా చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ధ్రువీకరించింది. ప్రతీకార దాడులు చేయాలన్న తమ ప్లాన్ గురించి ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు వెల్లడించినట్లు తెలిపింది. పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడానని, సంభాషణ సవ్యంగానే కొనసాగినప్పటికీ ఉక్రెయిన్- రష్యా మధ్య శాంతి సాధనకు అది ఉపకరించదని సామాజిక మాధ్యమంలో ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే క్రెమ్లిన్ స్పందన వచ్చింది. తుర్కియే నగరం ఇస్తాంబుల్ వేదికగా రష్యా, ఉక్రెయిన్ మధ్య మరోసారి శాంతి చర్చలు జరగనున్న వేళ.. 'స్పైడర్ వెబ్' పేరుతో గత ఆదివారం మునుపెన్నడూ లేని రీతిలో ఉక్రెయిన్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఏకంగా రష్యా భూభాగంలోకి కంటెయినర్లలో డ్రోన్లను తరలించి వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేపట్టింది. ఈ ఘటనలో రష్యాకు చెందిన 41 యుద్ధ విమానాలు, పలు ఎయిర్ బేస్‌లు ధ్వంసం అయ్యాయి. రష్యా భూభాగంలోని 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇర్కుట్స్క్ ప్రాంతంలోని వైమానిక స్థావరంలోకి వెళ్లి మరీ డ్రోన్లు దాడులు చేశాయి. ఈ దాడిలో టీయూ-95, టీయూ-22ఎం3 బాంబర్లు, కీలకమైన ఏ-50 ఎయిర్ క్రాఫ్ట్‌లు ఈ ఘటనలో ధ్వంసం అయ్యాయి. మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధంలో ఈ ఘటన మాస్కోకు పెద్ద కుదుపు కాగా, ఉక్రెయిన్ దళాలకు మరింత ఆత్మస్థైర్యం లభించినట్టు అంతర్జాతీయ విశ్లేషకులు తెలిపారు.

### ఉక్రెయిన్‌పై డ్రోన్లతో దాడి..

ఈ పరిణామాల వేళ రష్యా గురువారం ఉక్రెయిన్‌లోని ప్రైలుకీ నగరంలో డ్రోన్ల దాడి జరిపింది. అవి నివాస ప్రాంతాన్ని తాకాయని, ఒక ఏడాది బిడ్డ సహా ఐదుగురు మృతిచెందారని అధికారులు వెల్లడించారు. ఆ నగరం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు 100 కి.మీ.దూరంలో ఉంది. అక్కడ ఎలాంటి మిలిటరీ ఆస్తులు లేవు. ఇక ప్రైలుకీతో పాటు మిగిలిన నగరాలను కూడా 103 డ్రోన్లు తాకాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు.

## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు..
## ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

మొదటి పేజి తరువాయి

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం. మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్ పర్యావరణ పరిరక్షణ. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి. రాయలసీమలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోంది. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే మార్గాలు ఉన్నాయి. వరి వ్యర్థాల నుంచి కూడా బయో ఫ్యూయల్ తయారు చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలను గతంలోనే ప్రారంభించాం. తెదేపా ప్రారంభించిన ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసింది. " అని చంద్రబాబు అన్నారు.

### చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్

పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా ఏదైనా సాధించి మాట్లాడతానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చెట్టు లేని జీవితాన్ని ఊహించలేమని చెప్పారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని తెలిపారు. ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని పేర్కొన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు.

## కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

హైదరాబాద్, : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎసఏ) ఇచ్చిన నివేదికతోపాటు బ్యారేజీల వైఫల్యానికి కారకులైన వారిపై విజిలెన్స్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 10న సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. గురువారం నాటి క్యాబినెట్ సమావేశంలోనే ఈ సమీక్ష ఉంటుందని భావించినా.. ఉద్యోగులకు సంబంధించిన అంశాలపైనే సుదీర్ఘంగా చర్చ జరగడంతో వాయిదా పడింది. వాస్తవానికి రెండున్నర నెలల కిందటే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎసఏ నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం బ్యారేజీలపై కార్యాచరణ ప్రణాళికలు అందించాలని ప్రభుత్వం నిర్మాణ సంస్థలను కోరింది. కానీ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ధిక్కారస్వరం వినిపించడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సీఎం సమీక్ష కీలకంగా మారింది. ఇక కీలకమైన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు అంశంపై కూడా సీఎం 10వ తేదీన సమీక్షించనున్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి: సురేఖ

హైదరాబాద్, : ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతం చేయడం' అనే థీమ్‌తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు.

## ముస్లిం యువతి నిఖా వివాహానికి జమాల్ ఖాన్ ట్రస్ట్ ద్వారా రూ 60,000 చెక్ వితరణ



ఎటపాక ( జనం రిపోర్టర్ ) : మండల కేంద్రం లోని బిసి కాలనీ కు చెందిన ఎస్కే రంజాన్ కుమార్తె నిఖా జూన్ 22/6/2025 ఆదివారం జరుపతలపెట్టినారు. ఈ నేపథ్యంలో నిఖా ఏర్పాటుకు గాను ఆర్థికసాయం కొరకు జే.కే. సి. టి ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ ను నిఖా నిర్వాహకులు రంజాన్ దంపతులు సంప్రదించి సహాయం కోరగా గురువారం ట్రస్ట్ ద్వారా రూ. 60 ,000 చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఆడపిల్లలు ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయంగా ఆర్థికంగా కలిగిన వారు సహాయ సహకారాలు అందించాలని ఒక ఆడ మగ జంటను వివాహం ద్వారా ఏకం చేస్తే ఆ పుణ్యఫలం సహాయం చేసిన ఆ కుటుంబాలకు కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పేద మధ్యతరగతి వర్గ ఆడపిల్లల వివాహానికి తప్పకుండా ఆర్థిక సహాయం అందించి తోడ్పడాలని ఈ సందర్భంగా కోరినారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఇంచార్జ్ జావేద్, సీనియర్ టిడిపి నాయకులు మాజీ అధ్యక్షుడు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పి.సాల్మంరాజు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవము ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ




హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : జూన్ 5వ తేదీ సందర్భంగా ఈరోజు 66 వ డివిజన్ కేంద్రంలో ని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి యందు పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట



శాంతారాం కర్ణ మాట్లాడుతూ 1973 వ సంవత్సరం నుండి ఐక్యరాజ్యసమితి వాళ్లు ప్రతి సంవత్సరం రము జూన్ 5వ తేదీ ని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించినారు ప్రకృతి ప్రసాదితమైనటువంటి వనరులను మానవుడు విచ్చలవిడిగా వినియోగిస్తూ ప్రకృతి విధ్వంసం చేస్తున్న సందర్భంగా మానవ జీవనం మనుగడే కాకుండా భూమిపై ఉండే సకల ప్రాణులకు ముప్పు ఏర్పడి జీవవైవిధ్యము దెబ్బతిని ప్రమాదకర పరిస్థితిలో జీవించడం జరుగుతున్నది ముఖ్యంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం వలన ప్రతి సంవత్సరము 24% మరణాలు సంభవిస్తున్నాయి దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరము నిత్య జీవితంలో ప్లాస్టిక్ ను వినియోగించరాదు అనే నినాదంతో పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించడం జరిగినది మన పాఠశాలలో పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు మొక్కలు నాటడం నీటి సంరక్షణ ఇంధన వినియోగము చెరువుల సంరక్షణకు మట్టి వినాయక విగ్రహముల తయారీ ఉచిత పంపిణీ నిర్వహించడం జరుగుతూ అనేక జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయి అవార్డులను పొందడం జరిగినది ఈ సంవత్సరము ప్లాస్టిక్ వినియోగాన్ని పెళ్లిళ్లు శుభకార్యములలో వినియోగించకుండా ఉండడం కోసం మన పాఠశాలలో స్టీల్ బ్యాంకు ను ఏర్పాటు చేసి చెన్నూరి రూపేష్ ఐపీఎస్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది అంతేకాకుండా మనదేశంలో రాజస్థాన్ రాష్ట్రము ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుటకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక లక్ష రూపాయల నిధులను కేటాయిస్తూ స్టీల్ బ్యాంకు ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగినది. ఇది ఎంతోస్ఫూర్తిదాయకమైనటువంటి నిర్ణయం మన కార్యక్రమానికి ప్రోత్సాహకరంగా ఉన్నది అంతేకాకుండా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుటకు స్టీల్ బ్యాంకులను గ్రామపంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేయాలని చేస్తుందని ఆశిస్తూ ఇకముందు కూడా ప్లాస్టిక్ నిషేధానికి తద్వారా పర్యావరణ పరిరక్షణకు మన పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు కృషి చేస్తామని తెలిపినారు పాఠశాల ఆవరణలో విద్యార్థులచే మొక్కలను నాటించడం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు,ఏ వెంకట్, పి వెంకటేశ్వర్లు, వి అచ్యుత్ రెడ్డి, ఈ ప్రవీణ్, సిహెచ్ సంధ్య, వై అరుణ,జి సంధ్య, సరిత సిహెచ్ సుచిత్ర,కే లావణ్య, జీ దేవిక,భవాని, సుధారాణి, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు

## నేడు వేంకటేశ్వర స్వామి ఆలయం మూడోవ వార్షికోత్సవం.ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఆలయకమిటీ



రాజవొమ్మంగి, ( జనం రిపోర్టర్ ) : శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు వివరాల్లోకి వెళితే అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలోని స్థానిక శ్రీ శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 5.30 గంటల నుండి స్వామి వారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు,అలంకరణ,పుష్పార్చన కార్యక్రమాలు,తదనంతరం ఉ.9.00 గంటల నుండి స్వామి వారికి కల్యాణ మహోత్సవం జరుపబడునని,మధ్యాహ్నం 12.00 గంటల నుండి అన్నసమారాధన కార్యక్రమం జరుపబడునని,సాయంత్రం 5.30 గంటల నుండి విశాఖపట్నం గ్రామానికి చెందిన శ్రీ వాగ్దేవి నృత్యాలయం వారిచే నల్లి సౌందర్య సురేష్ అధ్యక్షతన వారి శిష్య బృందం వారిచే భరతనాట్యం,కూచిపూడి నృత్య ప్రదర్శనలు కలవని తెలియజేస్తూ, ఆలయ ధర్మకర్త సత్య%శీ%బాబు దంపతుల ముని మనుమరాలు,వర్మ దంపతుల మనవరాలు అయిన చిరంజీవి కార్తీక నాట్య ప్రదర్శన కలదని తెలుపుతూ భక్తులు అందరూ ఈ కార్యక్రమాలు అన్నిటిలోనూ పాల్గొని అన్న ప్రసాదములు స్వీకరించి వెళ్ళ వలసినదిగా ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.మరిన్ని వివరాలకు 9441385848,9441142933 నెంబర్లను సంప్రదించగలరని తెలిపారు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. ఫారెస్ట్ అధికారిని జి ఉషారాణి




రాజవొమ్మంగి, జూన్ 5 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలోని స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఫారెస్ట్ అధికారినిజి ఉషారాణి ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు పలు శాఖల ఉన్నతాధికారులు సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అడవులు వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలను వివరించారు ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి,సిఐ ఎన్ సన్యాసినాయుడు,తహశీల్దార్ ఎ సత్యనారాయణ,అరకు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు దంతులూరి శివాజీ రాజు,తాము సూరిబాబు,ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బంది,అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు అలాగే మండలంలోని రాజవొమ్మంగి జడ్డంగి లాగరాయి చెరుకుంపాలెం తదితర పలు పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి



.రేపల్లె ( జనం రిపోర్టర్ ) : పర్యావరణాన్ని మనం రక్షిస్తే పర్యావరణం మనల్ని కాపాడుతుందని ఆర్డిఓ రామలక్ష్మి తెలియజేశారు.గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆర్డిఓ రామలక్ష్మి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని వాటిని ఎదిగే వరకు సంరక్షించాలని ఆమె సూచించారు మొక్కల వలన వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చును అన్నారు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచులను వాడటం మానుకోవాలని గుడ్డ సంచులు లేదా జూట్ బ్యాగులను వాడుకోవాలని ఆమె సూచించారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు అనంతరం ప్రభుత్వ అధికారులు మొక్కలను నాటారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్ట మంగ మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మున్సిపల్ వైస్ చైర్మన్ టి కె వి గుప్తా మీసాల శ్రీనివాసరావు ప్రభుత్వ అధికారులు ప్రజలు పాల్గొన్నారు

## నేడు టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ లో పాల్గొన్న మంత్రి అనగాని



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర రెవిన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మాత్యులు అనగాని సత్యప్రసాద్ శుక్రవారం టిడిపి కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొంటారని ఆ కార్యాలయ సిబ్బంది తెలియజేశారు.రేపల్లెలో ఉదయం 10 గంటలకు సురక్ష హాస్పిటల్ ను



ప్రారంభిస్తారు.ఉదయం 11 గంటలకు రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం ( గ్రీవెన్స్ ) లో పాల్గొని ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరిస్తారుఅని తెలియజేశారు సమస్యలు ఉన్నవారు అర్జీ రూపంలో మంత్రిగారిని కలవవచ్చునని తెలిపారు

## గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలు

రేపల్లె ( జనం రిపోర్టర్ ) : గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలు తప్పు అని డిఎస్పి శ్రీనివాసరావు తెలియజేశారు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బక్రీదు పర్వదిన సందర్భంగా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను హింసించటం గాని, వదించటం గాని చేయకుండా శనివారం ( 7-6-25 ) జరిగే బక్రీద్ పర్వదినమును ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి అందరూ సహకరించాలని రేపల్లె డి. యస్. పి. ఏ. శ్రీనివాసరావు తెలియచేశారు. బక్రీద్ పర్వదిన సందర్భంగా ముస్లిమ్ పెద్దలతో, ఆర్. యస్. యస్., బి. జె. పి, విశ్వ హిందూ పరిషత్ సభ్యులతో ఈ రోజు మునిసిపల్ కార్యాలయంలో శాంతి కమిటీ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు జరిగినది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ కె. సాంబశివరావు సి. ఐ. ఏ. మల్లికార్జునరావు , శానిటరి ఇన్స్పెక్టర్ ఏ. రామచంద్రరావు, ఈద్గా కమిటీ ప్రెసిడెంట్ షేక్ జమీర్ , వైస్ ప్రెసిడెంట్ శ్రీ సలీమ్ ఖాన్ , సెక్రటరీ శ్రీ షేక్ మొహిద్దీన్ , షేక్ లియాఖత్ భాష , రాష్ట్రీయ గో సంఘ సెక్రటరీ పిన్ని సాంబశివరావు , బి. జె. పి. పట్టణ అధ్యక్షులు వి. శివరామప్రసాద్ యస్. మాణిక్యారావు , జి. కుటుంబరావు , డి. చంద్రశేఖర్ , మద్దు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 2025-26 సం ,, నకు బెస్ట్ అవైలబుల్ పాటశాల యందు 3వ,5వ,8వ తరగతుల ప్రవేశము కొరకు గిరిజన బాల/ బాలికల నుండి ధరఖాస్తులు చేసుకోవాలి..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5 ( జనం రిపోర్టర్ ) : గిరిజన బాల బాలికలు 3,5,8 తరగతుల ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కోరబడుచున్నవి. మొత్తం ఖాళీలు : 32 (3వ తరగతి : 16 ఖాళీలు లంబాడ బాలురు-10, %ూ% లంబాడ బాలికలు-05),(చెంచు)-01(బాలురు-0, బాలికలు-01), 5వ తరగతి : 09 ఖాళీలులంబాడ బాలురు-06, లంబాడ బాలికలు-02), పి.వి టి జి ఎస్ (చెంచు-01) (బాలురు-01,బాలికలు-0), 8వ : 07 ఖాళీలు ( ఎస్టి లంబాడ బాలురు-04, ఎస్టి లంబాడ బాలికలు-02)), పీవీ టి జి ఎస్ (చెంచు)-01 (బాలురు-01,బాలికలు-0). 1. అభ్యర్థులు వికారాబాద్ జిల్లా వాస్తవ్యులై వుండవలెను. 2.అభ్యర్థి యొక్క తల్లి దండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000/- లోపు మరియు పట్టణ ప్రాంతాల వారికి 2,00,000/- లోపు ఉండవలేయును. 3. ఒక కుటుంబం నుండి ఒక విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ పాటశాల క్రింద అవకాశము కల్పించబడును. 4. దరఖాస్తులుతేది: 09.06.2025 నుండి తేది: 17.06.2025 వరకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యలయం వికారాబాద్ జిల్లా నందు లభించును. 5.దరఖాస్తులు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యలయం,రూమ్ నం:%ూ%-03 సెకండ్ ఫ్లోర్ ,కలెక్టర్ కార్యాలయ ఆవరణ,వికారాబాద్ నందు తేది.09.06.2025 నుండి లభించును. పూర్తి చేసిన దరఖాస్తులను చివరి తేది. 17.06.2025 సాయంత్రం 5 గంటలలోపు పంపవలయును ఆ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు. 6. తేది: 20.06.2025 నాడు లాటరి విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక జరుపబడును. 7. దరఖాస్తు చేసుకొనుటకు కావలసిన ధృవీకరణ పత్రములు : కులము మరియు ఆదాయం, నివాసం మరియు ఆధార్ కార్డు, పుట్టిన తేది (బర్త్ సర్టిఫికెట్), ప్రస్తుతము చదువుచున్న పాఠశాల యొక్క బొనపైడ్, మరిము పాస్ పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించవలెను . 8. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నం:8639388553/9908598481 ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలని అధికారి తెలిపారు.

## భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడి నిచ్చే పంటలను సాగు చేయాలి

### మస్తిపురం నందిమల్ల గ్రామాలలో వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు




అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : భూసారని కాపాడుకుంటూ అధిక దిగుబడి నిచ్చే పంటలను సాగు చేయాలని కెవికె మదనపురం శాస్త్రవేత్త కెవికె వ్యవసాయ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి రైతులకు సూచించారు. గురువారం నందిమల్ల మస్తిపురం గ్రామాలలో రైతులకు వ్యవసాయం అధిక దిగుబడును ఇచ్చే పంటలు భూసారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. జాతీయ నూనె గింజల పరిశోధన స్థానం నుండి డాక్టర్ సురేష్ , ఆది ప్రసాద్, కె.వి.కె మదనపురం సైంటిస్టు రాజేందర్ రెడ్డి, డాక్టర్ అనిత వెటర్నరీ డాక్టరు రమేష్ విస్తరణ అధికారి, జి మల్లేష్ రైతుల సమావేశంలో పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చెరుకులో ఉండే సమస్యలు సాగు వివరాల గురించి రైతులకు వివరించారు.డాక్టర్ ఆది ప్రసాద్,నూనె గింజల పంటల ప్రాముఖ్యత గురించి రైతులకు తెలియజేశారు.అదేవిధంగా డాక్టర్ సురేష్ అధిక సాంద్రతలో విత్తే హైబ్రిడ్ ఆముదం రకం అయినటువంటి ఐ సి హెచ్ 5 గురించి రైతులకు తెలిపారు. అదేవిధంగా క్షేత్ర ప్రదర్శన కొరకు ఒక రైతుకు ఆముదం విత్తనాన్ని ఇవ్వడం జరిగింది. ఇంకా ఎవరైనా ఆసక్తిగల రైతులు ఆముదం పంటను సాగు చేయదలచినట్లైతే యాసంగిలో ముందుగానే రైతులు వారి పేర్లు నమోదు చేయించుకొని విత్తనం కే వి కే మదనపూర్ సెంటర్ ద్వారా తీసుకోవచ్చని సూచించారు.కార్యక్రమంలో భాగంగా వెటర్నరీ డాక్టర్ రమేష్ పశు వులలో వచ్చే గాలికుంటు వ్యాధి ,లంపి స్కిన్ మరియు గొర్రెలలో మేకలలో వచ్చేటువంటి వ్యాధులు మరియు వాటి నివారణ చర్యలు గురించి రైతులకు తెలియజేయడం జరిగింది.కెవికె మదనపురం సైంటిస్టు డాక్టర్ అనిత రైతులు ప్రతి సీజన్లో ఒకే వరి పంట వేయకుండా పంట మార్పిడి చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబలు సాధించి రైతులు లాభాలు పొందవచ్చు అని తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ,పశుపోషణ ,కోళ్ల పెంపకం చేపట్టినట్లయితే రైతుకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు.నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శాస్త్రవేత్తలు మొక్కను మస్తీపూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో నాటారు. అదేవిధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను రైతులకు తెలియజేస్తూ క్రిమి సంహారక పురుగుమందు డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు ,ఎరువుల సంచులు వీటన్నిటిని కూడా పొలంలో లేకుండా దూరంగా ఉంచాలని అదేవిధంగా ప్లాస్టిక్ వాడకని తగ్గించి పర్యావరణాన్ని ఆరోగ్యంగా ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరవింద్ వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా ను ప్లాస్టిక్ రహిత జిల్లా గా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5 ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా పరిధిలోనిఅటవీ శాఖ అద్వర్యం లో ఎండింగ్ ప్లాస్టిక్ పోలుషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమం లో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్లాస్టిక్ అనేది నిత్య జీవితం లో బాగమై చివరకు మన ఆహరం లో మాక్రో ప్లాస్టిక్ రూపం లో చేరుతుందని , అది మన ఆరోగ్యం పై తీవ్ర




ప్రబావం చూపుతుందని , ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ప్లాస్టిక్ రహిత జీవన విధానం లోకి మారాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని,మొక్కలు నాటడం, పెంచడం జీవిత చర్యల్లో భాగం కావాలన్నారు.కాలుష్య మరియు ప్లాస్టిక్ రహిత జిల్లా గా ఏర్పాటు చేయాలనీ, సమాజంలోని ప్రతి వ్యక్తి పర్యావరణాన్ని కాపాడుతానని ప్రతిన బూనాలన్నారు.భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలని పిలుపునిచ్చారు. త్వరలో అనంతగిరి ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మారుస్తామన్నారు.అనంతగిరి అర్బన్ పార్క్ లో జరిగే అభివృద్ధి పనులను కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు. పనులు తొందరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, అటవీ రేంజ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, రాజేందర్, ప్రతిమ, అటవీ సెక్షన్ అధికారి అరుణ, ఉద్యాన్ కేర్ స్వచ్ఛంద సమస్త నిర్వాహకులు, విద్యార్థినులు మరియు సత్య సాయి సేవా ట్రస్ట్ వారు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం



ఆత్మకూరు వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలోపోషమ్మ,కరెమ్మ,భూ లక్ష్మమ్మ,కోటమైసమ్మ,బొడ్రాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం గురువారం ఆత్మకూరు పట్టణంలో భక్తిశ్రద్ధలతో కొన్ని సాగింది. తెలంగాణ రాష్ట్ర మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గాయత్రి రవికుమార్ యాదవ్,మున్సిపల్ వైస్ మాజీ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి,పిఎ.సిఎస్ ప్రెసిడెంట్,లక్ష్మీకాంత్ రెడ్డి,మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ గౌడ్,మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు,మాజీ వైస్ ఎంపీపీ కోటేష్ ,మాజీ కౌన్సిలర్ రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ కోఆప్షన్ నెంబర్ రియాజ్ అలీ,మాసన్న,జానకి రాములు,కర్రె శీను,సోంబాబు,సిద్దు,అంజి.తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆత్మకూరు మండల కేంద్రంలో నాభి బొడ్రాళ్ళ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి కార్యక్రమంలో బిజెపి మండల నాయకుడు అశోక్ భూపాల్ యాదవ్ రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్ ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు బోరెల్లి రామ్, మండల నాయకులు దండు రవి, అశోక్ నంద కుమ్మరి మాసన్న మండల యువకులు పాల్గొన్నారు.

RNI : APTEL/2023/88525
జనం న్యూస్
తెలుగు జాతీయ దినపత్రిక
శుక్రవారం -06 -జూన్-2025

# భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడి నిచ్చే పంటలను సాగు చేయాలి

**మస్తిపురం నందిమల్ల గ్రామాలలో వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు**



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 5 జనం రిపోర్టర్:భూసారని కాపాడుకుంటూ అధిక దిగుబడి నిచ్చే పంటలను సాగు చేయాలని కెవికె మదనపురం శాస్త్రవేత్త కెవికె వ్యవసాయ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి రైతులకు సూచించారు. గురువారం నందిమల్ల మస్తిపురం గ్రామాలలో రైతులకు వ్యవసాయం అధిక దిగుబడును ఇచ్చే పంటలు భూసారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. జాతీయ నూనె గింజల పరిశోధన స్థానం నుండి డాక్టర్ సురేష్ , ఆది ప్రసాద్, కె.వి.కె మదనపురం సైంటిస్టు రాజేందర్ రెడ్డి, డాక్టర్ అనిత వెటర్నరీ డాక్టరు రమేష్ విస్తరణ అధికారి, జి మల్లేష్ రైతుల సమావేశంలో పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చెరుకులో ఉండే సమస్యలు సాగు వివరాల గురించి రైతులకు వివరించారు.డాక్టర్ ఆది ప్రసాద్,నూనె గింజల పంటల ప్రాముఖ్యత గురించి రైతులకు తెలియజేశారు.అదేవిధంగా డాక్టర్ సురేష్ అధిక సాంద్రతలో విత్తే హైబ్రిడ్ ఆముదం రకం అయినటువంటి ఐ సి హెచ్ 5 గురించి రైతులకు తెలిపారు. అదేవిధంగా క్షేత్ర ప్రదర్శన కొరకు ఒక రైతుకు ఆముదం విత్తనాన్ని ఇవ్వడం జరిగింది. ఇంకా ఎవరైనా ఆసక్తిగల రైతులు ఆముదం పంటను సాగు చేయదలచినట్లైతే యాసంగిలో ముందుగానే రైతులు వారి పేర్లు నమోదు చేయించుకొని విత్తనం కే వి కే మదనపూర్ సెంటర్ ద్వారా తీసుకోవచ్చని సూచించారు.కార్యక్రమంలో భాగంగా వెటర్నరీ డాక్టర్ రమేష్ పశు వులలో వచ్చే గాలికుంటు వ్యాధి ,లంపి స్కిన్ మరియు గొర్రెలలో మేకలలో వచ్చేటువంటి వ్యాధులు మరియు వాటి నివారణ చర్యలు గురించి రైతులకు తెలియజేయడం జరిగింది.కెవికె మదనపురం సైంటిస్టు డాక్టర్ అనిత రైతులు ప్రతి సీజన్లో ఒకే వరి పంట వేయకుండా పంట మార్పిడి చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబలు సాధించి రైతులు లాభాలు పొందవచ్చు అని తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ,పశుపోషణ ,కోళ్ల పెంపకం చేపట్టినట్లయితే రైతుకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు.నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శాస్త్రవేత్తలు మొక్కను మస్తీపూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో నాటారు. అదేవిధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను రైతులకు తెలియజేస్తూ క్రిమి సంహారక పురుగుమందు డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు ,ఎరువుల సంచులు వీటన్నిటిని కూడా పొలంలో లేకుండా దూరంగా ఉంచాలని అదేవిధంగా ప్లాస్టిక్ వాడకని తగ్గించి పర్యావరణాన్ని ఆరోగ్యంగా ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరవింద్ వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా ను ప్లాస్టిక్ రహిత జిల్లా గా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5 జనం రిపోర్టర్: వికారాబాద్ జిల్లా పరిధిలోనిఅటవీ శాఖ అద్వర్యం లో ఎండింగ్ ప్లాస్టిక్ పోలుషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమం లో అయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూప్లాస్టిక్ అనేది నిత్య జీవితం లో బాగమై చివరకు మన ఆహారం లో మాక్రో ప్లాస్టిక్ రూపం లో చేరుతుందని , అది మన ఆరోగ్యం పై తీవ్ర ప్రబావం చూపుతుందని , ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ప్లాస్టిక్ రహిత జీవన విధానం లోకి మారాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని,మొక్కలు నాటడం, పెంచడం




జీవిత చర్యల్లో భాగం కావాలన్నారు.కాలుష్య మరియు ప్లాస్టిక్ రహిత జిల్లా గా ఏర్పాటు చేయాలనీ, సమాజంలోని ప్రతి వ్యక్తి పర్యావరణాన్ని కాపాడుతానని ప్రతిన బూనాలన్నారు.భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలని పిలుపునిచ్చారు. త్వరలో అనంతగిరి ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మారుస్తామన్నారు.అనంతగిరి అర్బన్ పార్క్ లో జరిగే అభివృద్ధి పనులను కలెక్టర్ ఈ సందర్బంగా పరిశీలించారు. పనులు తొందరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, అటవీ రేంజ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, రాజేందర్, ప్రతిమ, అటవీ సెక్షన్ అధికారి అరుణ, ఉద్యాన్ కేర్ స్వచ్చంద సమస్త నిర్వాహకులు, విద్యార్థినులు మరియు సత్య సాయి సేవా ట్రస్ట్ వారు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం



ఆత్మకూరు వనపర్తి జిల్లా ప్రతినిధి జనం రిపోర్టర్:వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలోపోషమ్మ,కరెమ్మ,భూ లక్ష్మమ్మ,కోటమైసమ్మ,బొడ్రాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం గురువారం ఆత్మకూరు పట్టణంలో భక్తిశ్రద్ధలతో కొన్ని సాగింది. తెలంగాణ రాష్ట్ర మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గాయత్రి రవికుమార్ యాదవ్,మున్సిపల్ వైస్ మాజీ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి,పి.ఎ.సిఎస్ ప్రెసిడెంట్,లక్ష్మీకాంత్ రెడ్డి,మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ గౌడ్,మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు,మాజీ వైస్ ఎంపీపీ కోటేష్ ,మాజీ కౌన్సిలర్ రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ కోఆప్షన్ నెంబర్ రియాజ్ అలీ,మాసన్న,జానకి రాములు,కర్రె శీను,సోంబాబు,సిద్దు,అంజి.తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆత్మకూరు మండల కేంద్రంలో నాభి బొడ్రాళ్ళ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి కార్యక్రమంలో బిజెపి మండల నాయకుడు అశోక్ భూపాల్ యాదవ్ రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్ ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు బోరెల్లి రామ్, మండల నాయకులు దండు రవి, అశోక్ నంద కుమ్మరి మాసన్న మండల యువకులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



హసన్ పర్తి మండలంజనం రిపోర్టర్: హసన్ పర్తి మండల పరిధిలోని గ్రామం మడిపల్లిలో ఈరోజు 15 సంవత్సరాల చిరకాల వాంఛ రోడ్డు సాకారం చేసిన ఎమ్మెల్యే నాగరాజు గ్రామ అభివృద్ధికి, గ్రామస్తులు, నాయకులు అధికారులకు, ప్రభుత్వానికి సహకరించాలి గ్రామ ప్రజలకు తెలియజేశారుఇచ్చిన మాట నిలబెట్టున్న ఎమ్మెల్యే నాగరాజుమడిపల్లి నుంచి రాపాక పల్లె వరకు 2 కోట్ల రూపాయల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజుకాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని నిరూపిస్తూ వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా చేస్తూ నేడు హసన్ పర్తి మండల పరిధిలోని మడిపల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం గత పాలకుల నిర్లక్ష్యంతో దశాబ్దాలుగా చిరకాల కల రోడ్డు సహకారం చేస్తూ సిఆర్ ఆర్ నిధులు సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబోతున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుతోలుత ఎమ్మెల్యే నాగరాజుని గ్రామస్తులు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారుఅనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూగ్రామీణ అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం.నాణ్యతతో పనులు ఈ పనులు పారదర్శకంగా,నాణ్యతతో చేయాలన్నదే నా స్పష్టమైన ఆదేశం. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల ఈ సీసీ రోడ్లు మరియు డ్రైన్లు పూర్తయిన తర్వాత ప్రజలకు మంచి వాతావరణం, రవాణా సౌలభ్యం,శుభ్రత అందుతుందిప్రతి పథకం ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ తీసుకెళ్లే బాధ్యతను నేను గౌరవంగా తీసుకుంటున్నాను. ప్రజల సహకారం కీలకం అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం.మీ ఆశీర్వాదం, మీ సహకారం నాకు బలంగా నిలుస్తుంది అన్నారుగత 10 బిఆర్ఎస్ ప్రభుత్వం దోచుకున్న సొమ్ము అంతా సోషల్ మీడియాలో పెట్టి కాంగ్రెస్ పార్టీ మీద బుద్ధి జల్లే ప్రయత్నం చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ నాటకాలు ఆడుతూ ఇప్పుడు కొత్తగా లిక్కర్ రాని అలియాస్ కవిత మళ్లీ తెలంగాణలో దోచుకునేందుకు జాగృతి అని మళ్ళీ తెర మీదికి వస్తున్నారు తస్మాత్ జాగ్రత్త తెలంగాణ ప్రజలు మీ మాటలు విని మోసపోవడానికి ఎవరు లేరు మా నాయకుడు రేవంత్ రెడ్డి ని విమర్శించే ముందు ఒకసారి నిన్ను నువ్వు ఆలోచించుకో కవిత,తస్మాత్ జాగ్రత్త నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకుంటే తెలంగాణ సమాజం మిమ్మల్ని ఎవరు క్షమించరు అయ్యా బిడ్డ కలిసి ఆడుతున్న నాటకాలన్నీ ప్రజలందరూ గమనిస్తున్నారు మీ పార్టీకి పుట్టగతులు లేకుండా ప్రజలు తగిన బుద్ధి చెప్పిన కూడా మీకు సిగ్గు రావడంలేదన్నారుమడిపల్లి గ్రామంలోని అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్తానన్నారు.గ్రామానికి తర్వలోనే మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారుఅలాగే మీకు ఏ సమస్య ఉన్న నా డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య తెలియజేసే త్వరితగతన మీ సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తాను అన్నారుఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు మాచర్ల మహేందర్, మాజీ సర్పంచ్ చిర్ర సుమలత విజయ్, నాయకులు సుధాకర్ రెడ్డి, రాజు, శ్రీరామ్, తో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# భూభారతితో భూ సమస్యలు పరిష్కారం..

## భూములపై రైతులకు పూర్తి హక్కు కల్పించేందుకే భూభారతి..

**ఇందుర్తి రెవెన్యూ సదస్సులో 277దరఖాస్తులు...**

**రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్న తహసిల్దార్ ముద్దసాని రమేష్...**



చిగురుమామిడి(జనం రిపోర్టర్): భూ యజమానులు,రైతులు తమ భూమి రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉన్న, అర్హత ఉండి రెవిన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోయినా ఇతర భూ సమస్యలు ఉన్న అన్ని గ్రామాల్లో నిర్వహించే భూభారతి రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని చిగురుమామిడి తాహాశీల్దార్ ముద్దసాని రమేష్ కోరారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని,భూమి యజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తుందని తాసిల్దార్ పేర్కొన్నారు.రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తు చేసుకున్న సమస్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కరిస్తామని తెలిపారు.ఇందుర్తి రెవెన్యూ పరిధిలోని గాగిరెడ్డిపల్లె, ఓగులాపూర్,గునుకులపల్లె గ్రామాల్లోని భూ సమస్యలు ఉన్న రైతుల నుండి మొదటి రోజు 277దరఖాస్తులను స్వీకరించినట్లు తహసిల్దార్ వివరించారు.అనంతరం రైతులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కాంతాల రామ్ రెడ్డి, వెన్నం రాజిరెడ్డిలు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో భూ యజమానుల సమయం లేకుండానే భూములను ఇతర పేర్ల మీద మార్చారని, దీంతో బాధిత రైతులు రెవెన్యూ కార్యాలయంలో చుట్టూ తిరుగుతూ మానసికంగా కృంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెవెన్యూ వ్యవస్థలో నాడు చేసిన




తప్పులతో రైతులు ఇబ్బంది పడవద్దు అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని పక్కగా అమలు చేస్తుందని గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.రైతుల వద్దకే వచ్చి రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని రైతులు ప్రజలు హర్షిస్తున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఓగులాపూర్ గ్రామానికి చెందిన బండి పోచవ్వ,చింతగట్టు ఐలవ్వ, నరసయ్య, జెల్లా శివాజీ,జెల్ల భవానిలు చాలా సంవత్సరాలుగా తమ భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని రెవెన్యూ సదస్సు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసిల్దార్ స్వరూప రాణి, ఆర్ఐలు అరుణ్ కుమార్,తారా దేవి,రెవిన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిలో రైతు పొలానికి తొవ్వ చూపాలి..!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5 జనం రిపోర్టర్: భూములను వారికి ప్రతి ఒక్కరికి వెళ్లడానికి దారి ఉండాలి మనుషులకు రోగాలు ఉన్నట్టే తెలంగాణలో భూములకు సమస్యలు ఉన్నాయి. రైతు భూములకు ఉన్న ప్రధాన సమస్యలలో ముఖ్యమైనది తన భూమిలోకి వెళ్లడానికి దారి ( అచ్చ తెలంగాణ భాషలో తొవ్వ ) లేకపోవడం ఒకటి.ఇండియా, పాకిస్తాన్ వాఘా బార్డర్ క్రాస్ చేయడానికి ఓ పద్ధతి, పరిష్కారం ఉంది. కానీ, తెలంగాణలో రైతులు ఒకరి పొలం నుంచి ఇంకొకరి పొలంలోకి వెళ్లాలంటే పెద్ద యుద్ధమే చేయాలి.తెలంగాణలో నిజాం కాలంలో జరిగిన సర్వే మ్యాపులే ( విలేజ్ మ్యాప్) ఇప్పటికీ ఆధారం. ఈ సర్వేలో గ్రామంలో ప్రజలు నివసిస్తున్న భూభాగాన్ని గ్రామకంఠం పేరుతో మిగతా వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలకు సర్వే నంబర్లు కేటాయించడం జరిగింది. అదేవిధంగా వాగులు, ప్రజల అవసరాల కోసం ఉపయోగించే నక్ష బాటలు చాలా స్పష్టంగా పొందుపరచడం జరిగింది.భూ చట్టాల న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రతి ముప్పై ఏళ్లకోసారి సమగ్ర భూ సర్వే జరగాలి. కానీ, నిజాం కాలంలో జరిగిన సర్వే కూడా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జరగలేదు. పదివేల పైచిలుకు రెవెన్యూ గ్రామాలలో ఇప్పటికీ 413 గ్రామాలలో సర్వే రికార్డులు అందుబాటులో లేవు. ప్రస్తుత ప్రభుత్వం సర్వే కోసం వీటిని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టింది.జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు కాలువల కోసం భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం రైతులకు కొంత నష్టపరిహారం చెల్లించి, భూములు సేకరించి కాలువలు తవ్వింది. అందులో మైనర్, మేజర్ కాలువలు ఉన్నాయి. వాటి చుట్టూ రెండువైపులా కనీసం ముప్పై ఫీట్ల దారి ఏర్పడింది. కాలువల వల్ల రైతులకు కొంత ఉపశమనం దొరికినా..సేకరించిన భూమి రెవెన్యూ రికార్డులలో ఇరిగేషన్ కెనాల్గా కూడా అప్డేట్ కాలేదు. సమగ్ర భూ సర్వే ద్వారా విలేజ్ మ్యాపులు అప్డేట్ కాకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు.

## పరస్పర అంగీకారం

రైతుల పరస్పర అంగీకారంతో ముందు పొజిషన్లో ఉన్న రైతుకు, వెనకాల ఉన్న రైతు గుంటకు రెండు గుంటలు లేదా భూమి రీప్లేస్ రిజిస్ట్రేషన్ చేస్తేనే దారులు తెరుస్తున్నారు. ఈక్రమంలో వివాదాలు కూడా నెలకొంటున్నాయి. తరతరాలుగా ఒకరి భూమి నుంచి ఇంకొకరి భూమిలోకి వెళ్లాలంటే లైన్ ఆఫ్ కంట్రోల్.. ఇండియా, పాకిస్తాన్, లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్.. చైనాతో యుద్ధం చేసేంత పరిస్థితులు రైతుల మధ్య తరతరాలుగా నడుస్తున్నాయి.

నక్ష బాటలు కబ్జా చేసినా, పరస్పర అంగీకారంతో నడిచిన దారులు మూసేసినా రైతులు ఈజ్మెంట్ ఆఫ్ రైట్స్ ద్వారా కోర్టులను ఆశ్రయించి పరిష్కారం చేసుకోవచ్చు. కానీ, రెక్కాడితేకానీ డొక్కాడని రైతులు, గుంటలలో భూమి విస్తీర్ణం ఉన్న రైతులు కోర్టులను ఆశ్రయించి న్యాయంకోసం ఏళ్లపాటు వేచిచూసే పరిస్థితిలో లేరు.

## దారి చూపని ధరణి

గెట్టు పంచాయితీ లేని తెలంగాణ చేస్తా అని గత ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసి కొత్త రెవెన్యూ చట్టం 2020, ధరణి పోర్టల్ తెచ్చారు. కానీ, ఎక్కడా ఒక్క ఎకరం భూమి కొలిచింది లేదు. గెట్టు పంచాయితీ తేల్చింది లేదు. దారి చూపింది లేదు. రైతులు తమ వ్యవసాయ భూమి కొలవాలంటే మీసేవలో ఎఫ్ లైన్ పిటిషన్ ద్వారా అప్లికేషన్ చేసుకొని కట్న కానుకలు సమర్పించిన తర్వాతే, మండల సర్వేయర్ వచ్చి సర్వే చేసి.. సర్వే నంబరులో ఉన్న మొత్తం విస్తీర్ణం, తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం హద్దులతో పంచనామా ఇవ్వడం జరుగుతుంది. అంతేతప్ప ఒక సర్వే నంబర్లో ఉన్న రైతుల వాస్తవ విస్తీర్ణంతో రికార్డుల ప్రకారం ఎంజాయ్మెంట్ సర్వే ద్వారా సర్వే నంబరులో ఉన్న రైతులకు పరిష్కారం చూపడం లేదు.భూభారతిలో ఎంజాయ్మెంట్ సర్వే పరిష్కార మార్గదర్శకాలు ప్రభుత్వం రూపొందించాలి. ధరణి పోర్టల్లో ఉన్న కడస్ట్రియల్ మ్యాప్ (ఆన్లైన్ మ్యాప్) భూ భారతి పోర్టల్లో కనిపించడం లేదు. నిజాం సర్వే మ్యాపుల ద్వారా రైతులు తమ భూమి హద్దులు చూసుకునే అవకాశం ఉండేది. కానీ, ప్రస్తుతం పోర్టల్ పునరుద్ధరణలో భాగంగా కనిపించడం లేదు. ఆన్లైన్ మ్యాపులను త్వరగా అందుబాటులోకి తెచ్చినట్టు అయితే రైతులకు ఎంతోకొంత ఉపయోగపడుతుంది.

## భూభారతి పరిష్కారం చూపాలి

మేం అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ను బంగాళాఖాతంలో కలుపుతామని ప్రకటన చేసి కొత్త ఆర్వోఆర్ చట్టం 2024 భూభారతి పోర్టల్ను రూపొందించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ గ్రామ పాలన అధికారి, లైసెన్స్ సర్వేయర్ల నియామకం, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ ముందుకు వెళుతోంది. కానీ, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే పట్టాలు ఎక్కలేదు. కేవలం 413 గ్రామాలలో మాత్రమే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టింది.రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేపట్టి గెట్టు పంచాయితీ లేకుండా భూభారతి ద్వారా బాట పరిష్కారం చూపాలి. ఒక సర్వే నంబర్ నుంచి ఇంకో సర్వే నంబర్లోకి రైతులు వెళ్లడానికి కనీస అవసరాలకు అనుగుణంగా తోవ కోసం.. ఆయా జిల్లాల్లో భూమి విలువను బట్టి డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా విధిగా బాటలు తెరవాలి. ఈ మేరకు చట్టంలో వెసులుబాటు తెచ్చినట్టయితే తెలంగాణలో రైతులకు (దారులు, బాటలు, తొవ్వలు) విషయంలో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.



# ఘనంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడి జన్మ దిన వేడుకలు



హసన్ పర్తి మండలం జనం రిపోర్టర్:హసన్ పర్తి 66వ డివిజన్ హసన్ పర్తిలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గరిగె రాజు జన్మ దిన వేడుకలు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో ఘనంగా



నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ యువ నాయకుడు గరిగె రాజు మంచి భవిష్యత్ ఉందని.ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని,ఆయుఆ రోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గరిగె శ్రీనివాస్, గరిగె రాజ్ కుమార్, గరిగె రమేష్, వీసం సురేందర్ రెడ్డి, బల్సుకూరి శ్రీనివాస్, పెద్దమ్మ నరసింహారాములు, పెద్దమ్మ సురేష్, కనపర్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్మికుల 10 గంటల పెంపుదాలను విరమించుకోవాలి



రేపల్లె (జనం రిపోర్టర్)కార్మికుల పనిగంటలు 8గం నుంచి 10గంలు పెంపుదలను వ్యతిరేకిస్తూ సిఐటియు నిరసన..ఏడాది గడిచిన ప్రభుత్వం నిన్న మంత్రివర్గంలో పెట్టుబడిదారులకు లాభం చేసేలాగా కార్మికుల పనిగంటలు పెంపుదలా నిర్ణయాన్ని విరమించుకోవాలి సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ డిమాండ్‌లి... రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల ఆందోళనలో భాగంగా రేపల్లె బస్టాండ్ వద్ద సిఐటియు చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్లు పేరుతో కార్మికహక్కులపై దాడి చేస్తుంటే అదేబాటలో రాష్ట్రంలో ఏడాది గడిచిన కూటమి ప్రభుత్వం పాలన నిన్న మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో కార్మిక లోకంపై పెనుదాడి చేసింది.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 8 గంటల పని గంటలపై దాడి చేసింది,గత ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలతో విసుగుచెందిన రాష్ట్రంలో కార్మికవర్గం కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడిన నేపథ్యంలో ఏడాది తరువాత సరిగ్గా రాష్ట్రంలో కార్మికుల నెత్తిన పిడుగు లాంటి చర్య ఇది,5పని గంటలకు అరగంట విరామం ఉండగా,ఇప్పుడు ఆవిశ్రాంతి కోసం మరో గంట ఆదనంగా అంటే రోజుకు 8 గంటల పని నుండి 10 గంటలు పని చేయాలని,ఓవర్ టైమ్ (ఒటి)కి అవకాశం ఉండగా,ఓటి పనిగంటలు గంటలు కోడా పెంచారు.వాస్తవానికి ఓవరైమ్ అన్నది కార్మికుల ఇష్టప్రకారం చేయాల్సిన అదనపు పనికి ఆచరణలో అది యాజామాన్యాల ఇష్టంగా, కార్మికుల పాలిట నిర్బంధంగా ఎప్పుడో మారింది.తాజా నిర్ణయంతో ఓటి భారం కార్మికులపై మరింత పెరగనుంది,మహిళలకు కూడా నైట్ షిఫ్ట్ భారాన్ని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.మహిళల చేత నైట్ డ్యూటీ చేయించడానికి వీలుగా సిసి కెమెరాలు,లైట్లు,సెక్యూరిటీ వంటి సౌకర్యాలను కల్పించాలని మంత్రివర్గం కార్పొరేట్లకు సూచించింది.అయితే,పిల్లలు ఉండే మహిళలకు ఎటువంటి ఏర్పాట్లు చేస్తారన్న దాని గురించి ప్రస్తావించలేదు,మహిళా సాధికారతతో పేరుతో రాత్రిపూట మహిళల డ్యూటీలు నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించడం అంటే మహిళా కార్మికులు మోసం చేయటమే, ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలు చిన్నారుల దగ్గర నుండి 80 ఏళ్ల వృద్ధుల వరకు రోజువారి మహిళల మీద అత్యాచారాలు జరుగుతున్న ఘటనలు కోకలుగా ముందుకు వస్తున్న నేపథ్యంలో మహిళల భద్రతను దిగజారుస్తూ రాత్రిపూట డ్యూటీలు చేసే విధంగా అధికారికంగా చేయటం దారుణం అన్నారు,ఈ నిర్ణయాలు అమలుచేయడానికి వీలుగా పరిశ్రమలచట్టం (1948),ఎపి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం (1988)లో సెక్షన్లలోని కొన్ని నిబంధనలను సవరించాలన్న నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం తెలపటం అంటే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధంగా సవరణలు చేసి కార్మిక వర్గాన్నికి ద్రోహం చేయటమే అని విమర్శించారు,నిన్న మంత్రివర్గంలో కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై రాష్ట్రప్రభుత్వం పునరాలోచించి 8 గంటల పనివిధానం అమలుచేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యు.రామకృష్ణ ప్రసాద్,డి.ప్రభాకర్ రావు,కే.రమేష్,యు.వాసు,వి.సుబ్బారావు, బి.నాగరాజు,పి.విజయ్ తదితరులు పాల్గొన్నారు..

# భూ భారతి రెవెన్యూ సదస్సులలో భాగంగా వికరాబాద్ జిల్లా కోట్ పల్లి మండలం రాం పూర్ గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాటశాల లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి కోట్పల్లి జూన్ 5 (జనం రిపోర్టర్) : కోటిపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోరెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారంరిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. సరిపడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్లైన్ లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సమయపాలన పాటిస్తూ, అర్జీలు స్వీకరించాలని రెవెన్యూ బృందాలను ఆదేశించారు.భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మండలం లో ఎన్ని స్కూల్స్ , హాస్టల్స్ ఉన్నాయని తహసిల్దార్ తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేపటి నుండి జరిగే బడిబాట కార్యక్రమాన్ని ఊ రి పెద్దలతో కలిసి విజయవంతం చేయాలనీ, బడి బయట ఎవ్వరు ఉండరాదని, పిల్లలు అందరిని స్కూల్స్ లో చేర్పించాలని, మండలంలో బాల కార్మికులు ఉండరాదని, బాల్య వివాహాలు జరుగరాదని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రేషన్ షాపుల ద్వార మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యము పంపిణీకి ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్ డి ఓ వాసు చంద్ర, మండల తహసిల్దారు శ్రీనివాస్, సిబ్బంది, రైతులు తతితరులు పాల్గొన్నారు.

# పొన్నూరు లో యువకుడు మృతి..



పొన్నూరు జూన్ 5. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద గురువారం తెల్లవారుజామున శ్రీ విజయ గణేష్ లాడ్జి వద్ద పొన్నూరు మండలం ఆలూరు గ్రామానికి చెందిన షేక్ సైదా ( 32) మృతి చెందాడు. పొన్నూరు సిఐ వీరనాయక్ కథనం ప్రకారం మృతుడు మద్యం మత్తులో లాడ్జి పైకి వెళ్లి ప్రమాదవశాత్తు క్రిందపడి తనకు బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు మీడియాకు తెలిపారు. మృతుడుది హత్య కాదని.. ప్రమాదవశాత్తు జరిగిందని ఆయన వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత..







పొన్నూరు జూన్ 5. జనం రిపోర్టర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం – వనమహోత్సవం సందర్భంగా పొన్నూరు మండలం కసుకర్రు, పచ్చలతాడిపర్రు గ్రామాలలో గురువారం వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు మండల తెదేపా నాయకులు పాల్గొని మొక్కలను నాటారు. పర్యావరణ సమతల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వారు సూచించారు.కన్నతల్లి లాంటి పుడమితల్లిని కాపాడుకుందాం,పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరం బాధ్యతగా తీసుకుందాం. ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్ ను విడనాడదాం. వనమహోత్సవంలో ప్రతిఒక్కరం భాగస్వాములవుదాం.మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం. ప్రతి ఒక్కరు కూడా తప్పకుండా మొక్కలను పెంచాలి, కలుషితం లేని వాతావరణాన్ని ఆస్వాదించాలని కోరారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి చేత మొక్కల పెంపకంపై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, గుంటూరు పార్లమెంటు రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, నీటి సంఘ డిసి అధ్యక్షులు గనిపిశెట్టి రామకృష్ణ, మండల నాయకులు సోపాటి వెంకట్రావు, పొన్నూరు ఎంపీడీవో గుమ్మడి చంద్రశేఖర్, రావు , ఉపాధి హామీ పథకం ఏపీఓ సుభాషిణి, టెక్నికల్ అసిస్టెంట్ రత్నా రాజు, చలమశెట్టి సీతారామయ్య ,అరమండ విజయ్ కుమార్, బొప్పన బాపనయ్య, యలవర్తి శేషు, పసుపులేటి సుబ్బారావు, యంపరాల గోపి ,దాసరి మహాకాళేశ్వర రావు,శ్రీనివాస రావు, కోటయ్య, సాంబయ్య, రవి ,కూటమి ప్రభుత్వ నాయకులు ,ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా వనమహోత్సవం







వేలేరుపాడు (జనం రిపోర్టర్) :ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వనమహోత్సవంలో భాగంగా గురువారం రోజు స్థానిక తహసీల్దార్ కార్యాలయం మరియు మండలపరిషత్ కార్యాలయం, తాట్కూరుగోమ్ము, రేపాకగోమ్ము, రుద్రంకోట, కట్కూరు, కోయిదా, తీర్లపురం,కోయిదా, మేడేపల్లి మొదలైన పంచాయతీలలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు కలిసి వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు,కూటమి నాయకులు టీడీపీ మండల అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు తమ జీవిత కాలంలో మనిషికి కనీసం ఒక వంద చెట్లను ఐనా నాటాలని అన్నారు, రేపాకాగోమ్ము సచివాలయ సిబ్బందితో కలిసి సర్పంచ్ వెంకమ్మ మొక్కలను నాటారు, తీర్లాపురం సచివాలయం లో సర్పంచ్ చేతుల మీదుగా మొక్కలు నాటడం జరిగింది,మేడేపల్లి సచివాలయం లో వేలేరుపాడు జనసేన ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్, కమ్మచిచ్చు, కిరణ్ నాయుడు,టీడీపీ నాయకులు చాపర్ల, శ్రీను, బీజేపీ మండల అధ్యక్షులు ఓలేటి, బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు, ప్రతి ఒక్కరు మొక్కలని నాటి వాటిని ఎంతో జాగ్రత్తగా పెంచడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలన్నారు కూటమి నాయకులు, ఈ యొక్క కార్యక్రమంలో ఎంపీడి ఓ శ్రీహరి, ఆర్ భుజంగరావు, వీ ఆర్ వో సంగీత రావు, సచివాలయ సిబ్బంది,అటవీ శాఖ సిబ్బంది బీట్ ఆఫీసర్ లు కుంజా, విద్యాసాగర్, సతీష్, సింగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్లను నాటి పెంచి పర్యావరణాన్ని రక్షించాలి ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



హసన్ పర్తి మండలం(జనం రిపోర్టర్) : ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రజా ప్రభుత్వం ఇది చేతల ప్రభుత్వం అర్హులలందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంఅధికారులు సమన్వయంతో ప్రజలకు ప్రజా పాలన సేవలు అందించాలన్నారునాడు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన రేషన్ కార్డు లు నేడు మళ్ళీ కాంగ్రెస్ హయాంలోనేపర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్లను నాటి పర్యావరణాన్ని రక్షించాలని గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేసిన ఎమ్మెల్యే నాగరాజుగ్రామ పంచాయతీ భవనానికి ఎంజి



ఎన్ఆర్ ఈ జిఎస్ 20 లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు పాలనపరమైన ఇబ్బందులు కలగకుండా నేడు హసన్ పర్తి మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ శాఖ పరిధిలోని ఎంజీ ఎన్ ఆర్ఇజిఎస్ 20 లక్షల రూపాయల నిధులతో గ్రామ పంచాయతీ భవనానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తొలుత ఎమ్మెల్యే నాగరాజుని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారుగ్రామ మహిళామణులు కోలాటాలతో ఎమ్మెల్యే నాగరాజుని ఘన స్వాగతం పలికారు అనంతరం పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించాలని గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేసిన ఎమ్మెల్యే నాగరాజునంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచామని గత 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదనీ మళ్ళీ ఇందిరమ్మ ప్రభుత్వంలో వచ్చాకే అర్హులైన వారికి రేషన్ కార్డులను అందించమన్నారు మన వర్ధన్నపేట నియోజవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయించగా సుమారు ఇప్పటికే 1500కు పైగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం మరియు రైతులకు ఆత్మీయ భరోసా మహిళలకు పెద్ద పీట వేస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్న తరుణంలో ప్రతిపక్షాలు చేసే కుట్రలను తరిమికొడుతూ మన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు ఇది చేతల ప్రభుత్వం దయచేసి ప్రజలందరూ బిఆర్ఎస్,బిజెపి నాయకుల మాయమాటలకు మోసపోకుండా అన్నం పెట్టే కాంగ్రెస్ పార్టీని హక్కున చేర్చుకోవాలని అన్నారుఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు జోరిక పూల, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి, యూత్ నాయకులు మంద రాజు, జట్టి యుగేందర్, నితిన్ రెడ్డి, తో పాటు మండల గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు, మహిళలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ ఫండ్ నిబంధనలు సవరించాలని వినతిపత్రం



మెట్ పల్లి, జూన్ 5 జనం రిపోర్టర్ : రాష్టవ్యాప్తంగా న్యాయవాదులకు ప్రస్తుతం బార్ కౌన్సిల్ అమలు చేస్తున్న వెల్ఫేర్ ఫండ్ నిబందనలు సవరించాలని బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహా రెడ్డి కి మరియు సెక్రటరికి మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి ఒక వినతి పత్రం అందించారు. గురువారం హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుల సమావేశంలో మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు చెల్లించే వెల్ఫేర్ టికెట్ ధరని అమాంతం పెంచిన సందర్బంగా న్యాయవాదులకు అందించే ప్రయోజనాల్ని కూడా అదే నిష్పత్తి లో పెంచాలని అన్నారు. ప్రస్తుతం న్యాయవాదులకు లభిస్తున్న మెడికల్ ఎయిడ్ ను రూపాయలు 5 లక్షలకు, డెత్ బెనిఫిట్స్ ను రూపాయలు 25 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు . అలాగే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ని వీలయినంత తొందరగా అమలు చేయాలని, సెక్షన్ 35 బియన్నేస్ (41 సిఆర్పీసి) ని వెంటనే రద్దు చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్టు ఆయన చెప్పారు.

# : ఎటపాకలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ఎటపాక (జనం రిపోర్టర్) :అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక పంచాయతీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం ఎటపాక సచివాలయం మరియు ఎంపీడీవో ఆఫీస్ తాహసిల్దార్ ఆఫీస్ ల నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాటి చలపతిరావు పాల్గొని మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎటపాక సీఐ కన్నప్ప రాజు, తాహసిల్దార్ కారం సుబ్బారావు ,ఎంపీడీవో ప్రేమ్ సాగర్,ఎంపీపీ కాక కామేశ్వరి ఎటపాక పంచాయతీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, ఐ టి డి పీ క్లస్టర్ ఇంచార్జ్ బాచినేని శ్రీకాంత్ పాలడుగు నవీన్ ఎంపీడీవో ఆఫీస్ సచివాలయ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



# టీడీపీ నాయకులను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పరామర్శ..



పొన్నూరు జూన్ 5 జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ మండల పరిధిలోని అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకులను గురువారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పరామర్శించారు.అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పొన్నూరు మండలం అరెమండ గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు గరిగంటి సాయిబాబు, మామిళ్లపల్లి గ్రామ టీడీపీ యువ నాయకులు సుధా వంశీ కృష్ణలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పొన్నూరు మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటకృష్ణ ,తదితరులు ఉన్నారు..

# ఘనంగా ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల రక్తదానం




చొప్పదండి,జనం రిపోర్టర్ :ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం పురస్కరించుకుని గురువారం రోజున మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 38 మంది రక్తదానం చేసి కరీంనగర్ ఆయుష్ రక్తనిధికి అందించారు.అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని భగవంతుని ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. వారి సారథ్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పురం రాజేశం, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ మునిగాల రాజేందర్, నాయకులు ముద్దం తిరుపతి, పెరుమాండ్ల గంగన్న, కొట్టె అశోక్,మునిగాల సుధాకర్ గౌడ్, తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్, గుర్రం రమేష్ గౌడ్,కొట్టె చంద్రయ్య,మావురపు రాములు,ఆకుల సురేష్,కనుమల్ల రాజశేఖర్, గుంటి స్వరూప,కళ్యాణం శ్రీనివాస్, వలిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# తోటపల్లి సర్పంచ్ మోసం దుర్గా లక్ష్మి, యువనేత, మోసం కన్నా చొరవతో -

## అలుగు వాగు పరిశీలించిన,ఐ.టి.డి.ఎ (పి వో) అపూర్వ భరత్, చింతూరు.



ఎటపాక (జనం రిపోర్టర్) : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం, తోటపల్లి గ్రామపంచాయతీ, కుసుమాన పల్లి గ్రామ పరిధిలో... అలుగువాగు ప్రాజెక్టు కుడి కాలవ పూర్తిగా తీవ్ర వర్షాభావాల వల్ల పూడికలు ఏర్పడి కాలువ కోతకు గురై గండ్లు పడుతున్నాయని తద్వారా రైతులు ఇబ్బంది పడుతున్నారని, అనేకసార్లు రైతులు తమ సొంత ఖర్చులతో ఈ కాలువ మరమ్మతులు చేపట్టారని ఇకనైనా ఈ యొక్క అలుగు వాగు కాలువను సుమారు ఐదు కిలోమీటర్ల మేర మరమ్మతులు చేసి ప్రాజెక్టు గేటును ఏర్పాటు చేసినట్లయితే కుసుమానపల్లి, రేగడి గట్టు, ఒడ్డు గుంపు, బొడ్డుగూడెం, పందు వారి గూడెం, అయ్యవారిపేట, తోటపల్లి ఎర్ర బోరు గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని యువనేత వై.కా.పా ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మోసం కన్నా చింతూరు ఐటీడీఏ పి వో అపూర్వ భరత్ దృష్టికి తీసుకువెళ్లగా ఈరోజు పిఓ గారు ప్రత్యేకంగా అలుగు వాగు కాలవను పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని గేటు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా మోసం కన్నాను పీవో భరత్ గారు రైతులు ఇబ్బందులను తన దృష్టికి తీసుకు వచ్చినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి సర్పంచ్ మోసం. దుర్గాలక్ష్మి, ఎస్ టి సెల్ మండలం అధ్యక్షులు మోసం. కన్నా, టీపీ వీడు సర్పంచ్ మోసం. రాజులు, కుసుమనపల్లి గ్రామస్తులు -పూసం. నాగేశ్వరావు, సున్నం. బొజ్జయ్య, పి ఈ టి రమేష్, అపకా. నాగేష్, పూసం. బాబురావు,ఇరపా. బాలరాజు, సున్నం, వెంకటేష్, కోర్శ. రాజయ్య తదితరులు పాల్గొన్నారు

# పొన్నూరు ఆర్టీసీ డిపోలో పర్యావరణ దినోత్సవం..



పొన్నూరు(జనం రిపోర్టర్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం గుంటూరు జిల్లా ఏపీఎస్ఆర్టీసీ పొన్నూరు డిపో లో డిపో మేనేజర్ అజిత కుమారి సమక్షంలో డిపో గ్యారేజీ ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ అజిత కుమారి మాట్లాడుతూ పర్యావరణకు చెట్లు ఎంతో మేలు చేస్తాయని, డిపో ఆవరణ లోని ఖాళీ గా ప్రాంతంలో ఈ చెట్లను నాటాలని, కావున అందరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణమును, వాతావరణ సమతుల్యత ను కాపాడాలని తెలియజేసినారు . కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేదలకు రావలసిన ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎంపీడీఓ రాజకీయం...

**రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ నాయకుల బహిరంగ జోక్యం...**

**ఎంపీడీవో వైఖరిపై వెంటనే విచారణ జరపాలని కలెక్టర్ కు సిపిఐ నాయకుల విజ్ఞప్తి..**




చిగురుమామిడి( జనం రిపోర్టర్):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలను పక్కనపెట్టి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీడీఓ లబ్ధిదారులను ఎంపిక చేశారని, ఎంపీడీవో పై పూర్తి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ పార్టీ నాయకులు నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ ప్రమేల సత్పత్తిని కలిసి ఫిర్యాదుచేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అధికారులు,ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక జరగాల్సి ఉన్నప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి అధికార పార్టీ నాయకులతో కలిసి అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేశారని మండిపడ్డారు.ఎంతో మంది అర్హులైన వారు ఆయా గ్రామాల్లో ఇండ్లు లేక కిరాయి ఇండ్లలో ఉంటూ జీవిస్తున్నారని,కోట్లాది రూపాయల విలువ చేసే భూములు ఉన్న వారికి ఇండ్లను కేటాయించి,అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం ఇటీవల రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించిందని,యువ వికాసం పథకం కోసం ఎంతోమంది గంపెడు ఆశతో దరఖాస్తు చేసుకున్నారన్నారు.దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను కూడా గ్రామ సభలల్లో పెట్టకుండా, గ్రామాల వారిగా ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపిక చేయడంపై ఎంపీడీవో పై అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు.ఎంపీడీవో కార్యాలయంలో అర్ధరాత్రి వరకు అధికార పార్టీ నాయకులను కూర్చోబెట్టుకొని ఎంపిక చేసినట్లుగా మండలంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుందని అందుకు సీసీ కెమెరాల్లో దాగి ఉన్న వీడియోలే సాక్ష్యమని,వాటిని పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు వారు చెప్పారు.చిగురుమామిడి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విధానంపై,రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో ఎంపీడీవో వైఖరి పై సమగ్రమైన విచారణ జరపి,అర్హులైన నిరుపేదలకు ఇండ్లు,రాజీవ్ యువ వికాసం పథకం మంజూరీ చేసి అసలైన లబ్ధిదారులకు తగు న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ చిగురుమామిడి మండల సమితి వైపున కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జడ్పిటిసి అందే స్వామి,సిపిఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివలు ఉన్నారు.

# పొన్నూరులో ఉమెన్ ఫర్ ట్రీ కార్యక్రమం..






పొన్నూరు జూన్ 5 . జనం రిపోర్టర్:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం పొన్నూరు పురపాలక సంఘం లో ఉమెన్ ఫర్ ట్రీ అనే థీమ్ తో స్వచ్ఛ హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిడుబ్రోలు లోని పెద్దన్న పార్కు దగ్గర నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ యం .రమేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని, అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ హితమైన నారసంచులు ఉపయోగించాలని సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యతని తెలియచేశారు. ప్రధానంగా మహిళలు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని వాటిని పరిరక్షి పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి . ఇ. పి .వెంకయ్య , శానిటరీ ఇన్స్పెక్టర్ ఇ. శ్రీనివాసులు , మేనేజర్ టి. వెంకటేశ్వరరావు , స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మన నుంచే మార్పు ప్రారంభం కావాలి.... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




రామగుండం(జనం రిపోర్టర్) : రామగుండం:జూన్ 05. సమాజంలో మనం ఆశిస్తున్న మార్పు మన నుంచే ప్రారంభం కావాలని, మనం ముందు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, చెత్తను సెగ్రిగేట్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో డీసీపీ కరుణాకర్, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి తన తల్లి పేరిట మొక్కలు నాటాలని తద్వారా ఉష్ణోగ్రతను తగ్గించుకొని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని



కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మనం వినియోగించిన ప్లాస్టిక్ చెత్త సెగ్రిగేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ స్టాఫ్ పూర్తి స్థాయిలో ఇంటి వద్ద కూడా ప్లాస్టిక్ వాడకం నివారించాలని, చెత్తను సెగ్రిగేట్ చేయాలని, ప్రజలలో మనం ఆశిస్తున్న మార్పు మనం ప్రారంభం కావాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ఆవరణలో ప్లాస్టిక్ ఏరి వేత కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి శివయ్య, అటవీ శాఖ సిబ్బంది,జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పురుషోత్తపట్నం గ్రామంలో ఆలయపున : ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కార్యక్రమాలు గుండాల ఎంపిటిసి గొంగడి వెంకట్రామిరెడ్డి



ఎటపాక (జనం రిపోర్టర్) : అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం, గుండాల పంచాయతీలోని పురుషోత్తపట్నం గ్రామంలోని ఆలయ పున :ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజున మంగళ తోరణాలంకరణ, పంచ పల్లవ తోరణా అలంకరణ, గ్రామదేవతల ఆహ్వానం, విగ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, యోగినీ క్షేత్రపాలక, వాస్తు నవగ్రహ, సర్వతోభద్ర మండపారాధనలు, వేద పారాయణం, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, జలాధివాసం, ప్రదోష కాలార్చన, మహా నివేదన, నీరాజనం మహా మంత్రపుష్పములు, తీర్థ ప్రసాదములు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం నకు గ్రామంలోని 15 జంటలు హోమం దగ్గర కూర్చోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పురుషోత్తపట్నం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించడం జరిగింది.

# ఎమ్మెల్యే జన్మదిన పురస్కరించుకుని రక్తదానం



చొప్పదండి,(జనం రిపోర్టర్) : గురువారం రోజున చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా క్యాంప్ ఆఫీసులో బ్లడ్ డొనేషన్,కేక్ కటింగ్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా చొప్పదండి మహిళా పట్టణ అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యామ్ బ్లడ్ డొనేషన్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం చిరంజీవుడిగా 100 పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుంటూ చొప్పదండి నియోజకవర్గం ప్రజల శ్రేయస్ కొరకు అభివృద్ధి కొరకు దేవుడు ఆయనకు ఆశీస్సులు అందించాలని మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొత్తూరు మహేష్, మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజా భూమారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఏఎంసి వైస్ చైర్మన్ మునగాల రాజేందర్ ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి మాజీ పట్టణ అధ్యక్షులు ముద్ధం తిరుపతి గౌడ్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెరుమళ్ళ గంగయ్య గౌడ్, చీకటి కుమారస్వామి రాములు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమం పై సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...




రామగుండం:(జనం రిపోర్టర్) : రామగుండం:జూన్ 05. ప్రభుత్వ పాఠశాలలో అందే నాణ్యమైన విద్య పట్ల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బడిబాట కార్యక్రమం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న 10 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, 7 ఆదర్శ పాఠశాలలు, 361 ప్రాథమిక పాఠశాలలో, 83 అప్పర్ ప్రైమరీ స్కూల్స్, 104 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పరిధిలో విద్యా అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. బడి బాట కార్యక్రమం ద్వారా జూన్ 6 నుంచి జూన్ 19 వరకు ప్రభుత్వ పరిధిలో నడిచే వివిధ రకాల విద్యా సంస్థలో పిల్లలను జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో బడి బాట కార్యక్రమం నిర్వహించాలని, గత సంవత్సరం బడిబాట కార్యక్రమం ద్వారా 2099 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని కలెక్టర్ గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నామని త 10,186 మంది నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం కింద రిజిస్ట్రేషన్ చేసి వారికి విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.3 నుంచి 14 సంవత్సరాలు వరకు వయసు ఉన్నవారు తప్పనిసరిగా పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలని, ఆరోగ్య కారణాల వల్ల తీసుకోలేని పక్షంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాయించాలని, 15 సంవత్సరాల వయసు ఉన్న వారిచే ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే పిల్లలకు నాణ్యమైన విద్య బోధన అందుతుందని, ప్రభుత్వం ఇటీవల ఖాళీలను సైతం భర్తీ చేసిందని, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా అవసరమైన మౌలిక వస్తువులు కల్పించామని, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని అన్నారు.స్వశక్తి సహాయక సంఘాల సమావేశాల్లో కూడా బడిబాట గురించి చర్చించాలని కలెక్టర్ సూచించారు. జూన్ 12న. జరిగే సమావేశంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గత సంవత్సరం హాజర శాతం అధికంగా ఉన్న విద్యార్థుల, మంచి ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ను పాఠశాల ప్రారంభం సందర్భంగా సన్మానించాలని, ప్రభుత్వ పాఠశాలల లక్ష్యాలు తల్లిదండ్రులకు స్పష్టంగా తెలిసేలా ముందు రోజే తెలియజేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జెడ్ పి సి ఓ. నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జి సి డి వో కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల విద్య సామర్థ్యాల పెంపునకు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు,ఎంఈఓ లు కృషిచేయాలి.....

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష....



రామగుండం: జూన్ 05.(జనం రిపోర్టర్) : విద్యార్థుల విద్య సామర్థ్యాల పెంపునకు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు,ఎంఈఓ లు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.గురువారం రోజున పెద్దపల్లి అమర్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర లో జరిగిన కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈఓ ల వర్క్ షాప్ ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జూన్ 12వ తారీకు నుండి విద్యా సంవత్సరం మొదలవుతుందని , కావున పాఠశాల ప్రారంభం నుండే విద్యార్థుల యొక్క



అభ్యాసన సామర్థ్యాలను పెంచడంలో ప్రతి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హెడ్మాస్టర్, ఎంఈఓ లు అందరూ కూడా వృత్యంత్ర శిక్షణ పొంది ఉన్నారని ,కావున బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ప్రతి విద్యార్థి యొక్క బోధన సామర్థ్యాలను పెంచాలని, గత సంవత్సరం ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ .ఎల్. ఎన్ అంత్య పరీక్షలో 69% అచీవ్మెంట్ పొందడం జరిగిందని, ఈసారి విద్యార్థులు ధారాళంగా చదవడంలో అర్థం చేసుకొని రాయడంలో, గణిత సామర్థ్యాలను చాలా చక్కగా చేయడంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఎంఈఓ లు ప్రతినెల జరిగే కాంప్లెక్స్ సమావేశాలలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 85% అచీవ్మెంట్ ప్లానింగ్ చేసుకోవాలని దీనికి అన్ని విధాలుగా జిల్లా విద్యాశాఖ సహాయ సహకారాలు అందిస్తుందని, ప్రతినెల సందర్శించిన పాఠశాలలో సమీక్షలు నిర్వహించి, ఎక్కడైతే సామర్థ్యాలు పెంచాలో అక్కడ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాధవి, ఏ.ఎం.ఓ. పి.ఎం షేక్ ,ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కునూరు మండల వ్యాప్తంగా ప్రపంచ పర్యావరణ మరియు వనమహోత్స కార్యక్రమం







కుక్కునూరు:(జనం రిపోర్టర్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కుక్కునూరు మండలంలో కుక్కునూరు హెడ్ క్వార్టర్ లో ఎమ్మార్వో ఆఫీస్,ఎంపీడీవో ఆఫీస్, సచివాలయంలో, కుకునూరు హైస్కూల్లో, అగ్రికల్చర్ ఆఫీసులో , కుక్కునూరు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములి శెట్టి యుగంధర్, మరియు కుక్కునూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ములిశెట్టి, నాగేశ్వరరావు, మరియు జనసేన పార్టీ ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, మోదంపురపు వెంకన బాబు, కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అడవులు తగ్గిపోవడం కారణంగా ప్రజలు భూతాపానికి లోను కావాల్సి వస్తుందన్నారు, మరియు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం అలవాటుగా మార్చుకోవాలని, పిల్లలకు ఆస్తులకంటే విలువైంది పర్యావరణం అని అది బావుంటేనే ఆస్తులైనా సంపాదన ఐనా అని అన్నారు, వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో పెదరావిగూడెం పంచాయతీ అంగన్వాడీ కేంద్రం లో జరిగిన వన మహోత్సవ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షులు కే వీ ఎన్ దొర పాల్గొని ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మోదీజీ ఒక పిలుపునిచ్చారన్నారు, ప్రతి ఒక్కరు వారి వారి మాతృ మూర్తుల పేరిట మొక్కని నాటాలని హితవు పలికారని దానిని అనుసరించి ఈరోజు దేశ వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నరన్నారు ఈకార్య క్రమంలో ఎమ్మార్వో , ఎంపీడీవో , ఫారెస్ట్ రేంజర్ వారి సిబ్బంది మరియు అగ్రికల్చర్ ఆఫీసర్ వారి సిబ్బంది కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని మొక్కలు నాటడం జరిగింది

## డిసిఎం ఎస్ చైర్మన్ ను కలిసిన పొన్నూరు జనసేన నాయకులు..



పొన్నూరు జూన్ 5. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా డీసీఎంఎస్ జిల్లా సహకార శాఖ బ్యాంక్ చైర్మన్ గా ఎన్నికైన వడ్రాణం హరిబాబును గురువారం గుంటూరు ఆయన కార్యాలయంలో పొన్నూరు పట్టణానికి చెందిన జనసేన నాయకులు యన్నం నాయుడు, మిరియాల చంద్రకాంత్, తోట నాగరాజు, యలవర్తి వెంకటేశ్వరరావు, వెన్న రామారావు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి అభినందించారు. మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవ చేయాలనే వారు ఈ సందర్భంగా అభిలాషించారు. శుభాకాంక్షలు తెలిపిన పొన్నూరు జనసేన నాయకులకు వడ్రాణం హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటిన డాక్టర్ జి. అన్నా ప్రసన్న కుమారి....



రామగుండం:(జనం రిపోర్టర్) : రామగుండం:జూన్ 05. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్ నెస్ సెంటర్ల యందు మొక్కలను నాటారు. ఆయా ఆసుపత్రిల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను



తొలగించారు. ప్లాస్టిక్ ను తప్పనిసరై వాడినచో వాటిని పునర్వినియోగానికి పంపాలి అని అన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వినియోగం వల్ల కలిగే వాతావరణ కాలుష్యం, తద్వారా జరిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడడానికి వారి వంతుగా సహాయం చేస్తానని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

## జూన్ 05 ప్రపంచ పర్యావరణ దినోత్సవం. పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యం



చిగురుమామిడి (జనం రిపోర్టర్)భూమి నీరు గాలి చెట్లు జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి.ఇది మానవ మనుగడకు,అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం.భారతీయ మహర్షులు పర్యావరణాన్ని రెండు రకాలుగా అభివర్ణించారు.ఒకటి మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం,రెండవది అంతర్గత పర్యావరణం.ఈ రెండింటిని కూడా భగవంతుడే సృష్టించాడు.ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది.దానిని మానవులమైన మనం అర్థం చేసుకోవాలి.పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక,రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి.దీని వల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది.... నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది,దీనికి కారణం కాలుష్యం.(అదే పొల్యూషన్) పర్యావరణంలో అసమతుల్యతలు సంభవించడానికి...,జల కాలుష్యంవాయు కాలుష్యంభూ కాలుష్యం అత్యధికంగా జరుగుతుంది.కాబట్టి మానవ మనుగడగకు ఉపయోగపడే జల వాయు భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒకరి బాధ్యత....

## శ్రీ సాయిబాబా ఆలయం లో 11వ వార్షికోత్సవం..



పొన్నూరు జూన్ 5. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో 11వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.ఉదయం 7 గంటల నుంచే అభిషేకం, అర్చనలు, మంగళహారతులతో భక్తిపూర్వకంగా ప్రార్థనలు సాగాయి. ఆలయం సాయిబాబా విగ్రహాన్ని పుష్పాలంకరణలతో శోభాయమానంగా అలంకరించారు.అనంతరం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక కార్యక్రమంలో హారతులు, భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు.కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించబడింది. గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## డివిజన్ల పునర్ విభజన అధికార పార్టీ నేతల కోసం కాకుండా ప్రజలకు అనుకూలంగా పారదర్శకంగా చేయండి...



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:జూన్ 05. రామగుండం నగర పాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ముసాయిదా నోటిఫికేషన్ గందరగోళంగా ఉందని, ఎలాంటి పరదర్శకం చూపలేదని, ఏదో చేశామా అంటే చేసాం అని హడావిడిగా తప్పుల తడాకగ డ్రాఫ్టింగ్ నోటిఫికేషన్ తయారు చేసారని, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ విమర్శించారు.గురువారం రోజున మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంచార్జ్ కమిషనర్ అరుణ శ్రీ ని కలిసి మద్దెల దినేష్ వినతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం అయిన మాట్లాడుతూ చాలామంది ఓటర్లను లెక్కించకుండానే కేవలం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోనే సిబ్బంది కూర్చొని మొక్కుబడిగా ముసాయిదా తయారు చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కొన్ని డివిజన్లలోని ఓటర్లను పరిగణనలోకి తీసుకోకుండా, పార్ట్ అని పొందుపర చడం అయోమయానికి దారితీస్తోందన్నారు. ఓటరు జాబితా పొంతన లేకుండా ఉండడం పట్ల పలువురు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూన్నారని అన్నారు. 5వ ఇంక్లైన్, పరుశురాం నగర్ 33వ. డివిజన్ గా ప్రస్తుతం కొనసాగుతుంది ఇందులో సుమారు 32వందల ఓట్లు ఉండగా, ఇందులోనుండి పరుశురాం నగర్ ప్రత్యేక డివిజన్ సృష్టించి 33వ. డివిజన్ లో సంబంధం లేని తిలక్ నగర్ విఠల్ నగర్ ఓట్లను చేర్చడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 33వ. డివిజన్ లోని 5 ఇంక్ లైన్ లోని సుమారు ఆరు నుండి ఎనిమిది వందల ఇండ్లను ముసయిదా లో కనపడకుండా చేయడంలో ఆంతర్యం ఏమిటి అని, ఎవరి మెప్పు కోసం చేస్తున్నారని అధికార పార్టీ నేతలకు అనుకూలంగా ఉండేందుకు కోసం అధికారులు కష్టపడుతున్నార అని ప్రశ్నించారు. తొలగించినవన్ని దాదాపు దళిత సామజిక వర్గంకు చెందిన ఇండ్లు ఓటర్లే అని, దాని వల్ల రిజర్వేషన్లు మారిపోయే విధంగా అధికార పార్టీ నేతలు అధికారులు కలిసి ఈ తతంగం నడిపిస్తున్నారా అని ఆరోపించారు.మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ముందుగా మున్సిపల్ కార్యాలయం వదిలేసి డివిజన్లో పర్యటిస్తూ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తూ, అధికార పార్టీ నేతలకు అనుకూలంగా కాకుండా ప్రజలకు అనుకూలంగా విభజన ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు.కావాలనే దళితులు ఓటర్లను, ఇండ్లను వివక్షతతో తొలగిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, అలాంటి ఆలోచనలు ఉంటే అధికారులు మానుకోవాలని హితువు పలికారు. దళిత డివిజన్ల రిజర్వేషన్లకు భంగం కలిపిస్తే గౌరవ హై కోర్టును ఆశ్రయిస్తామని దినేష్ హెచ్చరించారు.

## ట్రాఫిక్ ను నియంత్రించని పోలీసు యంత్రాంగం.. పట్టించుకోని సంబంధిత అధికారులు.





పొన్నూరు జూన్ 5. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని ఎస్ పి పి రోడ్డులో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వలన ఈ రహదారి ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటుంది. వేళ్ళ పాళ్ళ లేకుండా భారీ వాహనాల రాకపోకలతో పాదాచారులతోపాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సంబంధిత పోలీసు, మున్సిపల్ అధికారులు స్పందించటం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మామ్ కే వాస్తేగా ట్రాఫిక్ నియత్రిస్తున్నావని పోలీసులు చెప్పుకుంటున్న ఆ స్థాయిగా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పొన్నూరు పోలీసులు ఎస్పిపి రోడ్డు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజల కోరుతున్నారు.

## పితృదేవునికి శ్రద్ధాంజలిగా

## మేకా వెంకట్రావు గారి పెద్దకర్మ సందర్భంగా సేవా కార్యక్రమం



జూన్ 5 పొదిలి(జనం రిపోర్టర్) :హైదరాబాద్ వాస్తవ్యులు కీర్తిశేషులు స్వర్గీయ శ్రీ మేకా వెంకట్రావు గారు 25-05-2025 తేదీన పరమాత్మలో లయమయ్యారు. ఈ రోజు, ఆయన పెద్దకర్మ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఆయన కుటుంబ సభ్యులు ఎంతో పవిత్రమైన సంకల్పంతో మానవతా సేవకు ముందుకొచ్చారు.వారి ఆత్మ శాంతి కోసం, నలుగురు నిరుపేదలకు కడుపునిండిన భోజనం అందించాలని మంచి ఉద్దేశంతో హోప్స్ ఫౌండేషన్ ద్వారా అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం హోప్స్ ఫౌండేషన్ మరియు అమ్మ దీవెన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడింది.పొదిలి పరిసర ప్రాంతాలలో తిరుగుతున్న నిరుపేదలకు, యాచకులకు మాత్రమే కాకుండా, నవ్యాంధ్ర దివ్యాంగుల సేవా సమితి వృద్ధాశ్రమం లోనూ భోజనం అందిస్తూ, మేకా వెంకట్రావు గారి పేరు చిరస్మరణీయంగా నిలిచేలా సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఇటువంటి సేవా కార్యక్రమాలు కు శాంతిని తీసుకురావడమే కాదు, సమాజానికి వెలుగునివ్వగల శ్రేష్ఠమైన మార్గాన్ని చూపుతాయి."మరణం అనంతరం కూడా చేయలేని వారిని మరిచిపోకూడదని, వారి జ్ఞాపకాలను సేవారూపంలో నిలుపుకోవడమే నిజమైన ఘనత" అనే సందేశాన్ని ఈ కుటుంబం అందరికీ అందించింది.

## జన్మదినాన్ని అర్థవంతంగా మార్చిన కట్టా అమరావతి గారి కుటుంబం



పొదిలి (జనం రిపోర్టర్) :తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం వాస్తవ్యులు శ్రీమతి కట్టా అమరావతి గారు తన జన్మదినాన్ని మరువలేని మానవతా సేవగా మార్చారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు ఎంతో హృదయపూర్వకంగా సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.వారి భర్త శ్రీ కట్టా సత్యనారాయణ గారు, కుమారుడు-కోడలు శ్రీ కట్టా నాగ వెంకటేష్ గారు శ్రీమతి కట్టా అపర్ణ గారు, కుమార్తె కట్టా కుసుమ గారు, మనవరాలు మహన్య శ్రీ వత్స గారితో కలిసి నలుగురు నిరుపేదలకు కడుపునిండా భోజనం అందించాలని సంకల్పించారు.ఈ దివ్యమైన సంకల్పానికి ఆజ్యం పోసినట్టు, హోప్స్ ఫౌండేషన్ మరియు దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు కట్టా అమరావతి గారి పేరుననే పొదిలి పరిసర ప్రాంతాలలో తిరుగుతున్న అనాధలకు, యాచకులకు, నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకోవడానికి చొరవ తీసుకొని ఇలా మానవతా దృక్పథంతో భోజనం అందించడమే నిజమైన సేవారూపమైన సంబరమని నిరూపించారు కట్టా కుటుంబ సభ్యులు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com